www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 6 | Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విశాఖపట్నం

చింతపండుకు మరింత గిరాకీ

- కోనాం సంతలో గత వారంతోపోలిస్తే కిలోకు రూ.10 పెరుగుదల


కోనాం సంతకు చింతపండు తెచ్చిన గిరిజనులు

చీడికాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం సంతలో గురువారం చింత పండు కొనుగోలుకు వ్యాపారులు అధిక సంఖ్యలో రావడంతో గిరాకీ పెరిగింది. గత వారంతో పోలిస్తే కిలోకు రూ.10 వరకు ధర పెరిగింది. ఆరు వారాల నుంచి చింతపండు ధరలు క్రమేపీ పెరుగుతుండడంతో గిరిజన రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. నిల్ల పచ్చళ్ల తయారు చేసే సీజన్ కావడంతో చింతపండు వినియోగం అధికంగా ఉందని, దీంతో అధిక ధరకు కొనుగోలు చేయకతప్పడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కోనాం సంతకు చీడికాడ, ... మిగతా 4వ పేజీలో

గోవాడ రైతులకు దక్కని ఊరట

- గత సీజన్‌లో సరఫరా చేసిన చెరకుకు ఇంకా రూ.4.73 కోట్లు పెండింగ్
- బకాయిలు చెల్లించిన తరువాత క్రషింగ్ సీజన్ ప్రారంభిస్తామన్న అధికారులు
- మాట నిలుపుకోకుండానే క్రషింగ్ మొదలు
- పాత బకాయిలను పక్కనపెట్టి.. కొత్త బకాయిలు చెల్లింపు
- యాజమాన్యం తీరుపై రైతులు అసంతృప్తి


ఫ్యాక్టరీలో చెరకు అన్‌లోడ్ చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

చోడవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

గోవాడ షుగర్స్ యాజమాన్యం తీరుపై చెరకు రైతులు మండిపడుతున్నారు. గత క్రషింగ్ సీజన్ (2023-24)లో సరఫరా చేసిన చెరకుకు ఇంతవరకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించలేదు. ఇవి సుమారు రూ.3.73 కోట్లు వుంటాయి. రవాణా చార్జీలు మరో కోటి రూపాయాలు ఇవ్వాల్సి వుంది. వీటిని పెండింగ్‌లో పెట్టి, ప్రస్తుత సీజన్‌లో సరఫరా చేసిన చెరకుకు డబ్బులు చెల్లించడంపై రైతులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

గత సీజన్‌లో గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో 1,70,601 టన్నుల చెరకు క్రషింగ్ జరిగింది. టన్నుకు రూ.2,919 చొప్పున యాజమాన్యం చెల్లించాలి. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా టన్నుకు రూ.2,500 మాత్రమే రైతులకు అందాయి. ఇంకా టన్నుకు రూ.419 చొప్పున రూ.7.14 కోట్లుతోపాటు రవాణా చార్జీలు కోటి రూపాయాలు అందవలసి ఉంది. ఇక ఫ్యాక్టరీలో పదవీ విరమణ చేసిన కార్మికులకు గ్రాట్యూటీతో పాటు, ఇతర బకాయిలు కూడా చెల్లించాలి. తమ బకాయిలు చెల్లించాలంటూ ప్రస్తుత క్రషింగ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు వినతిపత్రాలు ఇచ్చారు. బకాయిలు చెల్లించిన తరువాత క్రషింగ్ ప్రారంభిస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారు. రైతు సంఘాలు సైతం గత సీజన్ బకాయిల గురించి పలుమార్లు ఫ్యాక్టరీ ఎండీకి వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు, ఆందోళనలు కూడా నిర్వహించారు. పాత బకాయిలు క్లియర్ చేస్తామని హామీ ఇచ్చిన ఎండీ, జనవరిలో రూ.3 కోట్ల 41లక్షలు మాత్రమే రైతులకు చెల్లించారు. మిగిలిన బకాయిలు త్వరలో చెల్లిస్తామని చెప్పారు. పంచదార విక్రయించిన వెంటనే పాత బకాయిలు చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం, ఇప్పుడు పాత బకాయిలు పక్కన పెట్టి ప్రస్తుత సీజన్‌లో సరఫరా చేసిన చెరకుకు డబ్బులు చెల్లిస్తున్నది. యాజమాన్యం తీరుపై రైతులు విస్మయం చెందుతున్నారు. ప్రస్తుత సీజన్ డబ్బులతోపాటు పాత బకాయిలు కూడా ఒకేసారి చెల్లించి వుంటే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు. పాత బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారా? ఒకవేళ చెల్లించేటట్టయితే ఎప్పుడు ఇస్తారు?అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఈసారీ అరకొర సరకులే!

పౌరసరఫరాల గోదాములకు చేరని కందిపప్పు, గోధుమ పిండి

- వచ్చే నెలలో కార్డుదారులకు బియ్యం, పంచదారతోనే సరి
- రెండు నెలల నుంచి ఆగిన కందిపప్పు, గోధుమ పిండి సరఫరా
- ప్రభుత్వం మారినా... తీరుమారని పౌరసరఫరాల శాఖ


నర్సీపట్నంలో పౌరసరఫరాల గోదాము

నర్సీపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు ఏప్రిల్‌లో కూడా కందిపప్పు, గోధుమ పిండి సరఫరా అయ్యే పరిస్థితి లేదు. వచ్చే నెలలో పంపిణీ చేయడానికి బియ్యం, పంచదార మాత్రమే పౌరసరఫరాల గోదాములకు చేరాయి. కందిపప్పు, గోధుమ పిండి సరఫరాపై పౌరసరఫరాల అధికారిని వివరణ కోరగా.. మే నెల నుంచి కందిపప్పు పంపిణీ అవుతాయని, గోధుమ పిండి కొనుగోలుకు రేషన్‌కార్డుదారులు ఆసక్తి చూపడం లేదన్నారు.

జిల్లాలో 5,37,000 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. 1,069 చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా ఉచితంగా బియ్యం, సబ్సిడీపై పంచదార అందిస్తున్నారు. గతంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడు బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు, వంట నూనె, చింతపండు, గోధుమ పిండి, తదితర సరకులు తక్కువ ధరకు అందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బియ్యం, పంచదారను మాత్రమే క్రమం తప్పకుండా ... మిగతా 4వ పేజీలో

ఉత్సవానికి వేళాయె..

నేటి నుంచి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర

- రాత్రి 7.30 గంటలకు ప్రత్యేక పూజలతో ప్రారంభం
- భారీఎత్తున ఏర్పాట్లు
- భక్తులు ఎండబారిన పడకుండా చలువ పందిళ్లు


భక్తులు ఎండబారిన పడకుండా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. రాత్రి ఏడున్నర గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం రాత్రంతా ఆలయాన్ని తెరిచే వుంచుతారు. నూకాంబిక అమ్మవారి జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో భక్తులు ఎక్కడా అసౌకర్యానికి గురికాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారి కె.శోభారాణి, ఈవో వెంపలి రాంబాబు తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచనల మేరకు సుమారు 70 మందితో వివిధ కమిటీలను ఏర్పాటు చేసి వారికి బాధ్యతలు అప్పగించారు. భక్తులు క్రమపద్ధతిలో అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చంటిపిల్లలు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు ఎండబారిన పడకుండా ఆలయ ప్రాంగణంతోపాటు సమీపంలోని రహదారులపై చలువ పందిళ్లు వేశారు. క్యూలైన్‌లలో భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తారు. కేశఖండన తరువాత చిన్నపిల్లలకు స్నానం ఆచరించడానికి వేడినీటి సదుపాయం కల్పించారు. చంటి పిల్లలకు పాలిచ్చేందుకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 108 అంబులెన్స్ అందుబాటులో వుంటుంది. ఆలయం ప్రాంగణంతోపాటు ఆలయానికి వచ్చే మార్గాల్లో భారీ విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు.

వాహనాల పార్కింగ్‌కు పలుచోట్ల స్థలాలు కేటాయించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగు చర్యలు చేపట్టారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం తరపున నూకాంబిక అమ్మవారికి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పట్టువస్త్రాలను సమర్పిస్తారని తెలిసింది.

విద్యార్థులకు తగ్గనున్న మోత భారం

సగానికి సగం పుస్తకాలు తగ్గింపు

- ప్రభుత్వ నిర్ణయం
- వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా డిపోకు చేరుతున్న పాఠ్యపుస్తకాలు
- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు 38 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం
- ప్రస్తుతం 4 లక్షల వరకూ రాక


ముద్రణా కేంద్రం నుంచి బుక్‌డిపోకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు

గాజువాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మోతభారం తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సెమ్-1కు సంబంధించి ఒకటి, రెండు తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ కలిపి ఒక పాఠ్యపుస్తకం, ఒక వర్క్ బుక్ ఉంటాయి. గతంలో ఆరు పుస్తకాలు ఉండేవి. అటువంటిది రెండు పుస్తకాలకే పరిమితం చేశారు. అదేవిధంగా మూడు నుంచి ఐదో తరగతి వరకూ సెమ్-1కు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్ కలిపి ఒక పుస్తకం, మ్యాథ్స్, ఈవీఎస్ కలిపి ఒక పుస్తకం, రెండు వర్క్ బుక్స్ అందుబాటులోకి రానున్నాయి. గతంలో 8 పుస్తకాల వరకూ ఉండేవి. ఆరు, ఏడు తరగతులకు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, హిందీ కలిపి ఒక పుస్తకం, సైన్స్, సోషల్, మ్యాథ్స్ కలిపి ఒక పుస్తకం, రెండు వర్క్ బుక్స్ ఉంటాయి. ఎనిమిది, తొమ్మిది తరగతులకు ... మిగతా 4వ పేజీలో

స్థానిక ఖాళీలకు సజావుగా ఎన్నికలు

నాలుగు ఎంపీపీ స్థానాలను తిరిగి నిలబెట్టుకున్న వైసీసీ

- సబ్బవరం వైస్ ఎంపీపీ ఎన్నికలో ట్విస్ట్
- టీడీపీ, జనసేన మద్దతుతో వైసీపీ చీలిక వర్గానికి చెందిన సభ్యురాలి ఎన్నిక
- త్వరలో జనసేనలోకి నలుగురు ఎంపీటీసీ సభ్యులు?


చింతల బుల్లిలక్ష్మి (దేవరాపల్లి)


రుత్తల సర్వేశ్వరరావు (మాకవరపాలెం)


తాళ్లపురెడ్డి రాజారాం (మాడుగుల)


కేసుబోయిన వెంకటలక్ష్మి (ఎస్.రాయవరం)

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లాలో ఖాళీగా వున్న నాలుగు ఎంపీపీ, రెండు వైస్ ఎంపీపీ, పలు పంచాయతీల ఉప సర్పంచ్ పదవులకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఎంపీపీ పదవులను వైసీపీ తిరిగి నిలబెట్టుకుంది. చోడవరం, సబ్బవరం వైస్ ఎంపీపీలుగా వైసీపీ సభ్యులు ఎన్నికయ్యారు. అయితే సబ్బవరంలో వైసీపీ రెండుగా చీలిపోయింది. ముగ్గురు సభ్యులో గతంలో జనసేనలో చేరగా, మరో నలుగురు ఆ పార్టీలో చేరడానికి సిద్ధంగా వున్నారు. టీడీపీ, జనసేన మద్దతులో ఈ నలుగురిలో ఒకరు వైస్‌ఎంపీపీగా ఎన్నికయ్యారు. వైసీపీకి చెందిన మిగిలిన ఎనిమిది మంది సభ్యులు ఎన్నికకు హాజరుకాలేదు.

దేవరాపల్లి ఎంపీపీగా బుల్లిలక్ష్మి

దేవరాపల్లి ఎంపీపీగా వైసీపీకి చెందిన ఎ.కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యురాలు చింతల బుల్లిలక్ష్మి ఎన్నికయ్యారు. మండలంలో 17 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను టీడీపీకి చెందిన ఐదుగురు ఎన్నికల సమావేశానికి హాజరు కాలేదు. మూడున్నరేళ్ల క్రితం ఎంపీపీగా ఎన్నికైన కిలపర్తి రాజేశ్వరి గత అసెంబ్లీ ఎన్నికల ముందు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో ఆమె ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. ఖాళీ అయిన ఈ పదవికి గురువారం ఎన్నిక నిర్వహించారు.

మాకవరపాలెం ఎంపీపీగా సర్వేశ్వరరావు

మాకవరపాలెం ఎంపీపీగా వైసీపీకి చెందిన స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రుత్తల సర్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 16 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను వైసీపీకి చెందిన తొమ్మిది మంది హాజరయ్యారు. గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు భీమబోయినపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల సత్యనారాయణ ఎంపీపీగా రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తయిన తరువాత రాజీనామా చేయడంతో ఎన్నికల నిర్వహించాల్సి వచ్చింది.

మాడుగుల ఎంపీపీగా రాజారాం

మాడుగుల ఎంపీపీగా జమ్మాదేవిపేట ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపురెడ్డి రాజారాం ఎన్నికయ్యారు. మూడున్నరేళ్ల క్రితం మాడుగుల-2 ఎంపీటీసీ సభ్యుడు వేమవరపు రామధర్మజను ఎంపీపీగా ఎన్నుకున్నారు. అప్పట్లో చేసుకున్న ఒప్పందం మేరకు రెండున్నరేళ్ల తరువాత రామధర్మజ ... మిగతా 4వ పేజీలో

ఏటీఎం కార్డుల దొంగ అరెస్టు

- తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల కేసులు


నిందితుడితో పోలీసు అధికారులు, సిబ్బంది


స్వాధీనం చేసుకున్న ఏటీఎం కార్డులు

నర్సీపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కేంద్రాల్లో నగదు తీసుకోవడానికి వచ్చిన వారి నుంచి చాకచక్యంగా ఏటీఎం కార్డులు తస్కరించి, పిమ్మట డబ్బులు డ్రా చేసి జల్సాలు చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాస్ గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన ఇళ్ల వెంకటసాయి కిరణ్ పలు రాష్ట్రాల్లో ఏటీఎం కార్డుల చోరీ కేసుల్లో అరెస్టయి జైలు శిక్ష కూడా అనుభవించాడు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 10వ తేదీన నర్సీపట్నం కృష్ణాబజార్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో షేక్ రుక్సానా తన తల్లి ... మిగతా 4వ పేజీలో

శారదా నదికి తూట్లు

కశింకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని కొత్తపల్లి వద్ద ఉన్న శారదా నదిలో భారీఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. నది గట్టుకు అతి చేరువలో పది అడుగుల లోతు మేర ఇసుక తవ్వేయడంతో ప్రమాదం పొంచి వుంది. వర్షాకాలంలో నదిలో వరద ఉధృతి అధికంగా వుంటే గట్టు కోతకు గురై గండిపడి అవకాశం వుంది.

కొత్తపల్లి వద్ద భారీగా ఇసుక తవ్వకాలు

- గట్టుకు సమీపంలో పెద్ద పెద్ద గోతులు
- వర్షాకాలంలో గండ్లు పడే ప్రమాదం
- ఇసుక అక్రమార్కులకు స్థానిక ఉద్యోగుల అండదండలు


కొత్తపల్లి వద్ద శారదా నది గట్టును ఆనుకొని భారీఎత్తున చేపట్టిన ఇసుక తవ్వకాలు


తేగాడలో నిల్వ చేసిన ఇసుక

సొంతంగా ఇళ్లు నిర్మించుకునేవారు గ్రామాలకు సమీపంలోని నదులు, గెడ్డలు, వాగుల్లో నుంచి ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం వెసులుబాటు కల్పించిన విషయం తెలిసిందే. అయితే ఇందుకు కొన్ని నిబంధనలు విధించింది. స్థానిక సచివాలయంలో అనుమతి తీసుకుని, 24 గంటల్లో నిర్ణీత మొత్తంలో ఇసుక తీసుకెళ్లాలి. ఇసుక తవ్వకాలకు యంత్రాలను వినియోగించకూడదు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా మాత్రమే ఇసుక తీసుకెళ్లాలి. కానీ మండలంలోని కొత్తపల్లి వద్ద శారదా నదిలో ఇసుక అక్రమంగా తవ్వుతూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. యంత్రాల సాయంతో పది అడుగులకుపైగా లోతు తవ్వేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా సమీపంలోని తేగాడ గ్రామంలో పలుచోట్ల నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఇసుకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు అమ్ముతున్నారు. నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరపడం వల్ల గట్లు బలహీనంగా మారతాయని, భారీ గోతులు ప్రమాదకరంగా తయారవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇసుక కోసం తవ్విన గోతులు మునిగి చిన్నారులు మృతిచెందిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

స్థానిక ఉద్యోగుల అండదండలు

కొత్తపల్లి వద్ద శారదా నదిలో ఇసుక తవ్వకాలు స్థానిక ప్రభుత్వ ఉద్యోగులకు తెలిసే జరుగుతున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీఆర్వో, సచివాలయ సిబ్బంది, పంచాయతీ అధికారుల కళ్ల ముందే, పట్టపగలు ఇసుక తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోలేదంటే ముడుపులు బాగానే అందుతున్నాయని ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు వెంటనే స్పందించి కొత్తపల్లి వద్ద శారదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్.రాయవరం ఎంపీపీగా వెంకటలక్ష్మి



ఎన్నికల అనంతరం వైసీపీ ఎంపీటీసీ సభ్యులతో నూతన ఎంపీపీ వెంకటలక్ష్మి

ఎస్.రాయవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికలో ఎంపీపీగా కేసుబోయిన వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిణి మనోరమ ప్రకటించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన ఎంపీపీ ఎన్నికలో 20 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 14 మంది హాజరయ్యారు. వీరిలో 13 మంది వైసీపీ సభ్యులు, ఒక టీడీపీ సభ్యుడు ఉన్నారు. మిగతా ఆరుగురు సభ్యులు వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో వైసీపీకి చెందిన కొరుప్రోలు ఎంపీటీసీ సభ్యురాలు కేసుబోయిన వెంకటలక్ష్మి ఎంపీపీగా పోటీ చేయడానికి ముందుకు వచ్చారు. ఆమెను ఎస్.రాయవరం ఎంపీటీసీ-2 బొలిశెట్టి గోవిందరావు ప్రతిపాదించగా వమ్మవరం ఎంపీటీసీ సభ్యుడు బాలం సూరిబాబు బలపరిచారు. ఎవరూ పోటీ చేయకపోవడంతో ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం అయినట్టు



ఎంపీపీ వెంకటలక్ష్మి (ఫైల్)

ఎన్నికల అధికారిణి ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన వెంకటలక్ష్మితో ఎన్నికల అధికారిణి మనోరమ ప్రమాణం చేయించి అభినందించారు. నూతన ఎంపీపీ వెంటలక్ష్మికి ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఎంపీపీ ఛాంబర్‌లో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు సమక్షంలో నూతన ఎంపీపీ వెంకటలక్ష్మిను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నికలు

▸▸ ఒక్క మునగపాక ఎన్నిక వాయిదా



మునగపాకలో సభ్యులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మునగపాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉప సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఐదు పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవికి గురువారం ఎన్నికలు నిర్వహించారు. నాగులాపల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా 3వ వార్డు సభ్యుడు గోసాల గోవిందరాజులు ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ఎం.వెంకటలక్ష్మి తెలిపారు. తోటాడలో ఉపసర్పంచ్‌గా 1వ వార్డు సభ్యురాలు కోట్ల హేమ ఎన్నికైనట్లు పీవో వి.దీపిక తెలిపారు. నారాయుడుపాలెంలో ఉప సర్పంచ్‌గా 4వ వార్డు సభ్యుడు కొయ్య నల్లయ్య ఎన్నికయ్యారని పీవో డి.సీతారామరాజు చెప్పారు. రాజుపేటలో ఉప సర్పంచ్‌గా 7వ వార్డు సభ్యురాలు జెర్రిపోతుల కనకమహాలక్ష్మి ఎన్నికైనట్లు పీవో కె.ధర్మారావు పేర్కొన్నారు. మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్ పదవికి కోరం లేకపోవడం ఎన్నిక జరగలేదని పీవో సోమరాజు చెప్పారు. 14 వార్డు సభ్యులు ఉండగా.. ఒక్క సభ్యుడు కూడా ఎన్నికకు రాలేదని తెలిపారు. ఎన్నిక 28వ తేదీకి వాయిదా వేసినట్టు చెప్పారు.

బీకేపల్లి ఉప సర్పంచ్‌గా రాజేశ్వరి ఏకగ్రీవం



బీకేపల్లి ఉప సర్పంచ్ రాజేశ్వరి అభినందిస్తున్న సర్పంచ్ లింగంనాయుడు, తదితరులు

కోటవురట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపిరాజు కొత్తపల్లి ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. బీకేపల్లి ఉపసర్పంచ్ పెదపూడి లోవరాజు తన పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. సర్పంచ్ పెట్ల లింగంనాయుడు బలపరిచిన పెదపూడి రాజేశ్వరిని ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఎస్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. వైసీపీ మద్దతుదారులు ఎవరూ పోటీ చేయకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఉప సర్పంచ్‌గా ఎన్నికైనా పెదపూడి రాజేశ్వరిని కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి రఘురామ్, సచివాలయ సిబ్బంది అభినందించారు.

వెదురువాడ ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

వైసీపీ క్యాంపు రాజకీయం

మా సభ్యులను వైసీపీ దాచేసింది : టీడీపీ

ఎన్నిక జరపాల్సిందేనని వైసీపీ పట్టు

వాగ్వాదంతో అస్వస్థతకు గురైన ఈవోపీఆర్‌డీ

వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు

నేటికి ఎన్నిక వాయిదా

అచ్యుతాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురువాడ ఉపసర్పంచ్ ఎన్నిక గురువారం జరిగింది. ఈ ఎన్నికను కూటమి, వైసీపీ నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో క్యాంపు రాజకీయాలు చోటుచేసుకున్నాయి. అయితే ఈవోపీఆర్డీ శ్రీరామనాయుడు అస్వస్థతకు గురవడంతో ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడింది. వివరాల్లోకి వెళ్తే..

వెదురువాడ పంచాయతీలో పది మంది వార్డు సభ్యులున్నారు. గత ఎన్నికల్లో సర్పంచ్ పదవిని తెలుగుదేశం దక్కించుకుంది. ఇక్కడ ఏడు వార్డులు వైసీపీ గెలుచుకోగా.. మూడు వార్డులు, సర్పంచ్‌ను టీడీపీ కైవశం చేసుకుంది. దీంతో కొయ్య శ్రీనివాసరావు సర్పంచ్ అయ్యారు. ఉప సర్పంచ్ పదవికి వైసీపీలో ఇద్దరు వార్డు సభ్యులు పోటీ పడగా చెరో రెండున్నరేళ్లు చేసుకోవాలని ఒప్పందం జరిగింది. తొలుత చేకూరి పద్మావతికి ఉప సర్పంచ్ పదవి ఇచ్చారు. రెండున్నరేళ్ల తర్వాత బుద్ధరాజు రాజేష్ వర్మకు ఇవ్వాలని నిర్ణయించారు. రెండున్నరేళ్లు గడచిపోవడంతో అనుకున్న ప్రకారం పద్మావతి రాజీనామా చేశారు. ఈలోగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, ఇక్కడ కన్నబాబు రాజు ఓడిపోయి జనసేన తరపున సుందరపు విజయకుమార్ గెలవడంతో రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. బుద్దరాజు రాజేష్ వర్మ జనసేనలో చేరిపోయారు. దీంతో ఉపసర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. ఆరుగురు సభ్యులు వైసీపీకి. ఒకరు జనసేన, ముగ్గురు టీడీపీకి ఉన్నారు. వైసీపీలో ఇద్దరు టీడీపీ వైపు మక్కువ చూపుతున్నారు. దీంతో ఉపసర్పంచ్ పదవి తమకే దక్కుతుందని కూటమి నాయకులు భావించారు. ఈలోగా అనూహ్యంగా ఏడుగురు వార్డు సభ్యులను వైసీపీ నాయకులు సోమవారం నుంచి క్యాంపునకు తరలించారు. గురువారం ఎన్నిక సమయానికి వైసీపీ నాయకులు వారిని తీసుకువచ్చారు. అయితే తమ సభ్యుల్ని కూడా దాచేసి బలవంతంగా ఓటింగ్ చేయాలని చూస్తున్నారని, ఎన్నికలు వాయిదా వేయాలని సర్పంచ్ శ్రీనివాసరావుతోపాటు టీడీపీ సభ్యులు ఆదినుంచి వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికలు జరపాల్సిందేనని వైసీపీ నాయకులు పట్టుబట్టారు. ఈ సందర్భంగా జరిగిన వాగ్వాదం, కేకలకు ఎన్నికల అధికారిగా వచ్చిన ఈఓపీఆర్డీ శ్రీరామనాయుడు ఆందోళన చెందడంతో తీవ్ర అస్వస్థతకు గురై కింద పడిపోయారు. ఆయన ముందుగానే హార్ట్ పేషెంట్. విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ వైద్యాధికారి లిఖిత వైద్య పరీక్షలు జరిపి ఆయన్ని అంబులెన్స్‌లో అచ్యుతాపురంలో గల ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వెదురువాడ ఎన్నికల వద్ద ఘర్షణ జరుగుతుందన్న విషయం తెలిసి పరవాడ డీఎస్పీ వి. విష్ణుస్వరూప్, సీఐ నమ్మి గణేష్, ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో వచ్చి గొడవలు జరగకుండా నిలువరించారు. ఈఓపీఆర్డీ శ్రీరామనాయుడు అస్వస్థతకు గురవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేశారు.



వైసీపీ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్



ఈవోపీఆర్డీని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

కొత్తపేట ఉప సర్పంచ్‌గా ప్రసాద్

రాంబిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట ఉపసర్పంచ్‌గా జనసేన పార్టీకి చెందిన బొడ్డు ప్రసాద్ ఎన్నికయ్యారు. పంచాయతీ ఉప సర్పంచ్ కడగల సుజాత ఇటీవల రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉపసర్పంచ్ ఎన్నికను అధికారులు నిర్వహించారు. పంచాయతీలో 8 వార్డులుండగా.. ఉప సర్పంచ్ పదవికి బొడ్డు ప్రసాద్, గురిబిల్లి అచ్చియ్యమ్మ పోటీచేశారు.ఈ ఎన్నికలో ప్రసాద్‌కు నలుగురు వార్డు మెంబర్లు మద్దతు తెలపగా, అచ్చియ్యమ్మకు ముగ్గురు మద్దతు ఇచ్చారు. దీంతో ఉప సర్పంచ్‌గా బొడ్డు ప్రసాద్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి బీవీఎస్ రాజు ప్రకటించారు. అనంతరం ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ చీపురుపల్లి వరలక్ష్మి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట ఉపసర్పంచ్‌గా ఎన్నికైన ప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి రాజు తదితరులు



నిర్వాహకులతో మాట్లాడుతున్న లేబర్ ఆఫీసర్

'బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు'

పాయకరావుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): హోటళ్లలో 18 సంవత్సరాలు నిండని బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో చైల్డ్ లేబర్ డ్రైవ్‌ను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హోటళ్లు, దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులని, జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా బాలల సంరక్షణ ప్రతినిధి డి.లోవరాజు తదితరులున్నారు.

వీఎంఆర్డీఏ భూములు సేకరిస్తే టీడీఆర్ బాండ్లే ఇస్తుంది..

బాండ్లును రాష్ట్రంలో ఎక్కడైనా అమ్ముకునేందుకు అవకాశం

నిర్వాసితులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ వీఎంఆర్డీఏ ద్వారా జరుగుతోందని, సేకరించే భూములకు ఆ సంస్థ పరిహారంగా టీడీఆర్ బాండ్లనే ఇస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పష్టం చేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారడంతో రోడ్డు విస్తరణ అనివార్యం అయ్యిందన్న విషయం అందరికి తెలిసిందేనన్నారు.

టీడీఆర్ బాండ్లపై ఎటువంటి అనుమానాలు వద్దని, వాటిని రాష్ట్రంలో ఎక్కడైనా అమ్ముకునేందుకు అవకాశం ఉందన్నారు. బాండ్ల వినియోగంపై ఒక కమిటీ ఏర్పాటు చేసుకొని అవగాహన చెందాలన్నారు. నిర్వాసితులకు భరోసాగా ఉంటానని, విస్తరణకు సహకరించాలని కోరారు. టీడీఆర్ బాండ్లు వద్దు, నగదు చెల్లింపులు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే విజయకుమార్‌కు నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు, కూటమి శ్రేణులు మళ్ల జయమ్మ, దాడి మునిలినాయుడు, భీమరశెట్టి శ్రీనువాసరావు, టెక్కలి పరశురాం, నిర్వాసితులు పాల్గొన్నారు.



నిర్వాసితులతో సమావేశమైన ఎమ్మెల్యే విజయకుమార్

కొత్త అమావాస్య వేడుకలకు భారీ ఏర్పాట్లు

నేడు ఎలమంచిలి నూకాంబిక అమ్మవారి బోనాలు జాతర

ఎలమంచిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్య వేడుకలకు ఎలమంచిలి పట్టణంతోపాటు గ్రామాల్లోని నూకాంబిక అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామ గ్రామాన కొత్త అమావాస్య వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ. ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ఇప్పటికే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా మునిసిపాలిటీలోని పెదపల్లి, కొక్కిరాపల్లి, యర్రవరం, తెరువుపల్లి, సోమలింగపాలెం, కొత్తపాలెం తదితర పలు వార్డులతోపాటు మండలంలోని ఏటికొప్పాక, వీఎస్ఆర్‌పేట, పులపర్తి, లక్కవరం, కృష్ణాపురం, పోతిరెడ్డిపాలెం, పురుషోత్తపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నూకాంబిక అమ్మవారు

ఎలమంచిలి బస్టాండ్ సమీపంలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారి బోనాల జాతరను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు కమిటీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, శ్రీరాములు నాయుడు, గంధం శివ తెలిపారు. వందల సంఖ్యలో మహిళలు అమ్మవారి బోనాలతో ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరుతుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి ధర్మవరం కనకమహాలక్ష్మి ఆలయం మీదుగా కాకివానివీధి, కోమటిపేట, సతకం పట్టు నుంచి ప్రధాన రోడ్డు మీదుగా ఆలయానికి చేరుతుందన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న కోటవురట్ల జంక్షన్

కోటవురట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. సూర్యప్రతాపం, వడగాలులతో వాతావరణం నిప్పుల కుంపటిలా ఉంటోంది. మార్చి నెల చివరి వారంలో ఎండలు మండుతుంటే మిగతా మూడు నెలల పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి ఉదయం 9 గంటల నుంచే వడగాడ్పులు వీయడంతో జనం ఇళ్లలోంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. గురువారం కోటవురట్లలో ఉష్ణోగ్రత 38.3 డిగ్రీలు, రాజుపేటలో ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదైంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉండడంతో వడగాడ్పులు, ఉక్కపోత చోటుచేసుకున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు రెండు రోజుల నుంచి పెరుగుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కోటవురట్ల మెయిన్ రోడ్డు నిర్మానుష్యంగా కనిపిస్తున్నది.

భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ఎస్.రాయవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేవీ పాలెంలో నిర్వహించనున్న భూ రీసర్వేను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు కోరారు. గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ భూ రీసర్వేతో సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. రైతులందరూ దగ్గరుండి రీ సర్వే చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి'

పాయకరావుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలని పాస్టర్ల ఫెలోషిప్ సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారిక్కడ సమావేశమై పాస్టర్ ప్రవీణ్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రవీణ్ అకాల మరణం పట్ల చింతిస్తూ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు పట్టణంలోని అరటికాయల మార్కెట్‌లోని సీఐఎం చర్చి నుంచి వై జంక్షన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అపోస్తులు ఎం.దానియేల్, దయారత్నం, పాస్టర్ ఎసయ్య, ఎన్.సాల్మన్‌రాజు, బి.అనిల్, డి.సువార్తరాజు, పి.ప్రకాష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలంటూ గురువారం సాయంత్రం అచ్యుతాపురం జంక్షన్‌లో క్రైస్తవులు శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈనెల 24న ప్రవీణ్ మృతిచెందారు. ప్రమాదమా.. హత్యా అనే విషయంపై విచారణ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్‌లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని పాస్టర్ల ఫెలోషిప్ మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ పాస్టర్ శేఖర్ ఆధ్వర్యంలో సమావేశమైన పాస్టర్లు ప్రవీణ్ మృతికి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం మండల పాస్టర్ల ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు జాన్ డేవిడ్ మాట్లాడుతూ కొంతమంది మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు రాజకీయంగా మనుగడ సాగించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మాసారాజు, స్టీఫెన్‌పాల్, ఐజాక్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న పాస్టర్లు

ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి

నక్కపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ద్వారా లభిస్తున్న మార్కెటింగ్ సదుపాయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, పాయకరావుపేట, ఎలమంచిలి మండలాల ఓపెన్ నెట్‌వర్క్ ఈ కామర్స్ సెల్లర్స్(ఓఎన్‌జీసీ) అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ చేసుకునే సదుపాయం లభిస్తున్నందున వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, డీపీఎం వరప్రసాద్, సత్యవేణి, ఏపీఎం శ్రీనివాస్, ఐదు మండలాల ఏపీఎంలు, సెల్లర్స్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

రాంబిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు జడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పడాయి భీపై ఇచ్చిన మూడు రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏసీడీపీవో లలితకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు ఎస్‌వీఎస్ రాణి, మాలతీదేవి అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

31న మంత్రి నారా లోకేశ్ పర్యటన

▸▸ అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీన అచ్యుతాపురంలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటిస్తారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల కూటమి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 31వ తేదీన అచ్యుతాపురంలో ఫ్లైఓవర్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేస్తారన్నారు. అచ్యుతాపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ నిర్మిస్తున్నట్టు చెప్పారు. మంత్రి లోకేశ్ పర్యటనను నాలుగు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, రాష్ట్ర యాదక కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, నేతలు జనపరెడ్డి శ్రీనివాసరావు, రాజాన రమేష్‌కుమార్, వి.దినబాబు, పప్పల నూకన్నదొర తదితర నేతలు పాల్గొన్నారు.

'పేట'లో ఘనంగా కార్పెంటర్స్ డే



పాయకరావుపేటలో ర్యాలీ చేస్తున్న కార్పెంటర్లు

పాయకరావుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కార్పెంటర్స్ డే బుధవారం ఘనంగా జరిగింది. ఏపీ రాష్ట్ర కార్పెంటర్స్(వడ్రంగి) అసోసియేషన్, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కార్పెంటర్స్ సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి పెదపూడి నరసింహమూర్తి మాట్లాడుతూ కార్పెంటర్ల ఎదుర్కొంటున్న సమస్యలు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి రాష్ట్ర సంఘం ఎంతో కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పాయకరావుపేట కార్పెంటర్స్ సంఘం అధ్యక్షుడు కొప్పోజు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు రామోజు నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దివిలి నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి గానుగుల సత్యనారాయణ, దివిలి వరహాలు, రామోజు రంగ, ఎం.సత్యనారాయణ, పుల్లేటికుర్తి గవరయ్య, నాళం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో చేతి బోర్లకు మరమ్మతులు

పాయకరావుపేట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో మూలకు చేరిన మూడు చేతి బోర్లుకు బుధవారం మరమ్మతులు చేశారు. ఇంటింటికి కొళాయిలు వస్తున్న నేపథ్యంలో బోర్లను గ్రామస్థులు ఉపయోగించడం లేదు. నిరుపయోగంగా వదిలేయడంతో గ్రామంలో మూడు బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని మరమ్మతులకు గురైన మూడు చేతి పంపులను పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు పంచాయతీ సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ తెలిపారు.

అక్రమ మట్టి తవ్వకాలు అరికట్టాలి : సీపీఎం

అచ్యుతాపురం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'కొండకర్ల, చోడపల్లి శివారు హద్దుల్లో గ్రావెల్ దందా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన వారు తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని సందర్శించారు. కొండలు, చెట్లను తొలగించి ఎక్స్‌కవేటర్లతో తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నా కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న మట్టి దొంగలపై చర్యలు తీసుకొని పర్యావరణాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఆ ప్రాంతాన్ని సందర్శించిన వారిలో సీపీఎం మండల నాయకులు కర్రి అప్పారావు, రొంగలి రాము, బుద్ద రంగారావు, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత రైతులకు గోకులం షెడ్లు

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ భరోసా

మునగపాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ భరోసా ఇచ్చారు. స్థానిక తంపరమూల ప్రాంతంలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే విజయకుమార్ ఆ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. కాలిపోయిన రెండు పశువుల పాకల స్థానంలో గోకులం షెడ్‌లు నిర్మిస్తామని బాధితులు ఆడారి రమణ సూరి అప్పలనాయుడు, శరగడం లక్ష్మిలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందజేస్తామని చెప్పారు. గాయపడిన పశువులకు మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అగ్ని ప్రమాద బాధితులను జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ పరామర్శించారు.

నేడు బీసీ, ఈబీసీ రుణాల ఎంపిక

అచ్యుతాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన బీసీ, ఈబీసీలకు రుణాల మంజూరుపై శుక్రవారం ఎంపిక జరుగుతుందని ఎంపీడీఓ కె. ప్రభాకరరావు తెలిపారు. లబ్ధిదారులు రుణ దరఖాస్తు నకలు, కుల ధ్రువీకరణ ఒరిజనల్ పత్రాలను తీసుకొని ఎంపీడీవో కార్యాలయానికి ఆయన కోరారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా

అచ్యుతాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించడంతోపాటు స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ సీపీఎం శ్రేణులు గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో ధర్నా చేశాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు భిన్నంగా ఇప్పుడు వ్యవహరిస్తున్నారన్నారు. విద్యుత్ సంస్కరణలపై తాము చేస్తున్న పోరాటానికి అంతా మద్దతునివ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో రొంగలి రాము, కర్రి అప్పారావు, కె. సోమునాయుడు, రాజు, చండి తదితరులు పాల్గొన్నారు.

ఐవోసీఎల్ వాహనాలు ప్రారంభం

రాంబిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లోని ఐవోసీఎల్ కంపెనీ అందజేసిన వాహనాలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గురువారం ప్రారంభించారు. ఐవోసీఎల్ కంపెనీలో జరిగిన కార్యక్రమలో ఎలమంచిలి మునిసిపాలిటీకి చెత్తను తరలించేందుకు నూతన కంప్యాక్టర్ వాహనం, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి మండలాల పోలీస్ స్టేషన్‌లకు మూడు బొలేరో వాహనాలను ఐవోసీఎల్ అధికారులు, ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, కంపెనీ ప్రతినిధులు, పోలీస్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి నూకాంబిక జాతరకు
400 మందితో బందోబస్తు

- రెండు షిఫ్టుల వారీగా ఆలయం, స్టేడియం వద్ద విధులు
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు
- పట్టణ, ట్రాఫిక్ సీఐలు విజయ్‌కుమార్, వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక జాతర సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో డీఎస్పీ ఎం.శ్రావణి పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు షిఫ్టుల వారీగా పోలీస్ సిబ్బంది ఇటు ఆలయం వద్ద, అటు ఎన్టీఆర్ స్టేడియం వద్ద విధులు నిర్వహించనున్నారు. కానిస్టేబుల్ నుంచి సీఐల వరకు సుమారు 400 మందితో జాతరలో బందోబస్తు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాల్లో వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశామని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ పేర్కొన్నారు. వాహనచోదకులు వారికి కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయానికి వచ్చే మార్గాల్లో కూడా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ వివరించారు.

ఉగాది నాటికి
కుటుంబ సాధికార సారథుల జాబితా సిద్ధం

టీడీపీ శ్రేణులకు సూచించిన నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ



రెండు మండలాల టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జీ

సబ్బవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సాధికార సారథుల (కేఎస్ఎస్) జాబితాను ప్రతి గ్రామం నుంచి ఉగాది నాటికి పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ నేతలకు సూచించారు. ఇరువాడలో గురువారం పెందుర్తి, సబ్బవరం మండలాల ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. కుటుంబ సాధికార సారథుల జాబితాలను అమరావతికి పంపిన తరువాత గ్రామ, మండల కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ రెండు ఎన్నికల్లో కుటుంబ సాధికార సారథులే కీలకంగా వ్యవహరిస్తారన్నారు. అందుకే ఈ జాబితా కీలకం కానుందన్నారు. ఈ జాబితా తయారీలో భేదాభిప్రాయాలు ఉన్నచోట సమన్వయ కమిటీ సభ్యులు సమన్వయం చేయాలని సూచించారు. ఈనెల 29న పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. పార్టీ సభ్యత్వ కార్డులు ప్రతి ఒక్కరికీ అందేలా నేతలు చర్యలు తీసుకోవాలని సూచించారు, కార్డులు రానివారి జాబితాను తనకు ఇస్తే అమరావతి నుంచి తెప్పించే ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గండి వంశీదీప్, భర్నికాన బాబూరావు, గండి ముత్యాలనాయుడు, బొండా సత్యారావు, రెడ్డి నారాయణరావు, అవుగడ్డ అప్పలనాయుడు, రేసుపూడి రమణ, పల్ల తాతారావు, పెద్దాడ రమణమ్మ, రొంగలి దేముడు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యమాంబ అమ్మవారి పండుగ

సబ్బవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదుళ్లనరవ గ్రామంలో ముత్యమాంబ అమ్మవారి పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పసుపు కుంకుమలను సమర్పించుకున్నారు. సాముగరడీ, నేల డ్యాన్స్‌లు, కోలాటం, బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారిని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ దర్శించుకున్నారు. కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు వీరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొల్లి ముత్యాలనాయుడు, ఇందలి రమణ, గండి దేముడుబాబు, అయితి సింహాచలంనాయుడు, టి.అర్జున, గండి దేముడు, ఉరుకూటి శ్రీను, సేనాపతి సోమశేఖర్, నీటిపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధికి చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి హెచ్‌వోపీ సమీర్‌శర్మ

పరవాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎస్ఆర్ నిధుల ద్వారా చేయూతనిస్తామని సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు (హెచ్‌వోపీ) సమీర్‌శర్మ తెలిపారు. మండలంలో గల సర్పంచులు, పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో గురువారం సంస్థ అడ్మిన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సీఎస్ఆర్ నిధులను వెచ్చిస్తున్నామన్నారు. విద్య, ఆరోగ్యం, తాగునీటి సరఫరాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో ఏఏ అభివృద్ధి పనులు అవసరమో వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి తమకు అందజేస్తే, ఆ ప్రకారం సీఎస్ఆర్ నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. అనంతరం ఆయా గ్రామాలకు అవసరమైన పనులను సర్పంచులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు పద్మప్రియ, బీబీ పాత్ర, సీఎస్ఆర్ విభాగం ప్రతినిధులు కె.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలపై అవగాహన

కశింకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని అంతా విడనాడాలని వెదురుపర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల వాడడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ బొమ్మల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులు అధికంగా వాడడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. మానవుల ఆరోగ్యంపై ఆ ప్రభావం పడడంతో పాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలపై విద్యార్థులంతా పూర్తి అవగాహనతో ఉండి, ప్రతి ఒక్కరినీ ఈ విషయంలో చైతన్య వంతులను చేయాలని కోరారు. అనంతరం స్పందించే హృదయం ఆధ్వర్యంలో గుడ్డ సంచులను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బోయిన చిన్నారావు, సబితలక్ష్మి, పీవీఎస్ఎన్ మూర్తి, నూకరాజు, సత్యవాణి, త్రివేణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'సాయినార్ ఫార్మా' కార్మికులు ఆందోళన

పరవాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఫార్మాసిటీలోని సాయినార్ ఫార్మా లైఫ్‌సైన్సెస్ పరిశ్రమకు చెందిన కార్మికులు గురువారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యం ముందస్తు సమాచారం లేకుండా పరిశ్రమను మూసివేయడం దారుణమన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలతో పాటు గ్రాట్యుటీ, ఫైనల్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యానికి లేబర్ కమిషనర్ పంపిన ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మహేశ్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు.. ఆక్రమణలకు లేదా అడ్డు..

- అనకాపల్లి- చోడవరం మార్గంలో ఇష్టారాజ్యంగా వ్యాపారాలు
- గుండాల జంక్షన్ నుంచి మాటూరు జంక్షన్ వరకు మరీ దారుణం
- తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం



అనకాపల్లి - చోడవరం మార్గంలో గుండాల వద్ద రోడ్డుపై ఉన్న పాత ద్విచక్ర వాహనాలు

తుమ్మపాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- చోడవరం రోడ్డు ఆక్రమణలకు గురవుతోంది. పలువురు వ్యాపారులు రోడ్డును దర్జాగా ఆక్ర మించి వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. దీంతో ఇక్కడ తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

జిల్లా కేంద్రంగా మారాక మరింత రద్దీ

అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత అనకాపల్లి- చోడవరం రోడ్డులో రద్దీ పెరిగింది. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. చుట్టుపక్కల మండలాల నుంచి అనకాపల్లిలో గల పలు కార్యాలయాలకు, వ్యాపార లావాదేవీలకు, స్కూళ్లు, కళాశాలలకు వచ్చే విద్యార్థులతో నిత్యం సందడిగా ఉంటుంది. అయితే మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పలువురు వ్యాపారస్తులు మెయిన్‌రోడ్డును ఆక్రమించి వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. కొంతమంది తాత్కాలికంగా తోపుడు బండ్లపై వ్యాపారాలు చేస్తుండగా, మరికొంత మంది పక్కాగా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గుండాల జంక్షన్ నుంచి తుమ్మపాల పంచాయతీ పొలిమేర వరకు రోడ్డు కుంచించుకుపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అన కాపల్లి మండలంలో అధికంగా క్వారీ, క్రషర్లు ఉండడంతో భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ట్రాఫిక్ సమస్యతో ఈ రోడ్డులో గంటలతరబడి నిలిచిపోతున్నాయి. దీంతో పాటు ఈ రోడ్డులో నిర్వహించే వ్యాపార సముదాయాలకు వచ్చే వారు తమ వాహనాలను చాలాసేపు రోడ్డుపైనే నిలిపివేస్తూ ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపారాలకు వెళ్లే వారు సమయానికి గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా ఈ రోడ్డులో హోటళ్లు, తినుబండారాల బండ్ల దుకాణాలు ఏర్పాటు చేయడంతో సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే పాత ద్విచక్ర వాహనాల షెడ్‌లను రోడ్లపైనే నిర్వహిస్తూ పాత వాహనాలను మెయిన్‌రోడ్డు పైనే నిలిపివేస్తున్నారు. అలాగే మెకానిక్ షెడ్‌లు, మట్టికుండలు తదితర వ్యాపారాలు రోడ్డు మీదే సాగిస్తూ పలువురు వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ రోడ్డులో ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయంలేకుండా చూడాలని అంతా కోరుకుంటున్నారు.



చినబాబు కాలనీ వద్ద రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టు



తుమ్మపాల వద్ద రోడ్డు పై నిర్వహిస్తున్న మెకానిక్ షెడ్

నేటి నుంచి తాకాశి వీధిలో నూకాంబిక జాతర

- భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు
- కొత్త అమావాస్య రోజున విశేష పూజలు





ఊరేగింపులో కాళీమాత, కాంతార వేషధారణలు



గరగల ఊరేగింపులో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని తాకాశి వీధిలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. ఇం దుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాశి కిశోర్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు తాకాశి రాజేష్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టామన్నారు. దారి పొడవునా ఆలయం ముందు భాగంలో చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ వంటివి ఏర్పాటు చేశామని వివరించారు. 29వ తేదీన కొత్త అమావాస్య సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని విశేషంగా అలంకరించి, పసుపు కుంకుమలతో పూజలు చేస్తామన్నారు.

ఇదిలావుంటే, ఈ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి గరగల ఊరేగింపు జరిపారు. ముందుగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా నేలవేషాలు, కాళీమాత, కాంతార వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తాకాశి కన్నబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాశి కిశోర్, కమిటీ సభ్యులు, తాకాశివీధి పెద్దలు పాల్గొన్నారు

నేత్రపర్వంగా
షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

కొత్తూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరు శారదానగర్‌లో గల షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరరావు, ప్రభాకర్ విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు కరణం మురళీ, కరణం ఆనంద్, అప్పారావు, వెంకటమోహనరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వానికి సీపీఎస్
ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు

అనకాపల్లి టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ ఉద్యోగుల నెలవారీ చందాను ప్రతి నెలా ఆయా పీఆర్ఏఎన్ అకౌంట్‌లోకి ప్రభుత్వం జమ చేయడం హర్షణీయమని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎనిమిది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. సీతానగరం గ్రామానికి చెందిన ఎస్.నూకరాజు గురువారం తుమ్మపాలలో మద్యం కొనుగోలు చేసి స్వగ్రామానికి తీసుకు వెళుతున్నాడన్నారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు అనుమానం వచ్చి తనిఖీ చేయగా నూకరాజు వద్ద ఎనిమిది క్వార్టర్ మద్యం బాటిళ్లు బయటపడ్డాయన్నారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

తుమ్మపాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొండుపాలెంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన రీ సర్వేను రైతులంతా విజయవంతం చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇంతవరకు రీ సర్వే జరగని భూముల రైతులు ఈ సర్వేకు హాజరు కావాలన్నారు. ఈ మేరకు సచివాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది నోటీసులను ప్రదర్శించారన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొత్తూరు బ్రిడ్జి రోడ్డుకు
మరమ్మతులు చేపట్టాలని ఆందోళన

కొత్తూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలకు వెళ్లే బ్రిడ్జి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. ఈ మార్గం గుండా వడ్డాది, రావికమతం మండలాలకు చేరుకోవచ్చన్నారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉండడమే కాకుండా రోడ్డు సక్రమంగా లేకపోవడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ, క్రషర్ల లారీలు పరిమితికి మించి టన్నుల బరువుతో రోడ్డుపై రాకపోకలు సాగిస్తుండడం వల్ల రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడుతున్నాయని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వియ్యపు రాజు, వీరాచారి, త్రినాథ్, పోతురాజు, సత్యనారాయణ, రామారావు, గణేష్, శ్రీనివాస్, శ్రీను, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం వైస్ ఎంపీపీ-2గా మామిడి లక్ష్మి

- కూటమికి చెందిన ఏడుగురు, వైసీపీకి చెందిన నలుగురు ఎంపీటీసీలు ఎన్నికకు హాజరు



వైస్ ఎంపీపీ-2గా ఎన్నికైన లక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



మామిడి లక్ష్మితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రిటర్నింగ్ అధికారిణి రమామణి

సబ్బవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యా లయ సమావేశ మందిరంలో గురువారం వైస్ ఎంపీపీ-2 ఎన్నిక ప్రశాంతగా జరిగింది. రిటర్నింగ్ ఆఫీసర్ కె.రమామణి ఆధ్వర్యంలో ఉదయం పదకొండు గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభమైంది. టీడీపీ, జనసేన కూటమికి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఏడుగురు, వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు నలుగురు మొత్తం 11 మంది హాజరయ్యారు. కోరం సరిపోవడంతో ఎన్నికల అధికారిణి ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ముందుగా నారపాడు ఎంపీటీసీ మామిడి లక్ష్మిని వైస్ ఎంపీపీ-2 (వైసీపీ)గా సబ్బవరం ఎంపీ టీసీ-2 ప్రతిపాదించగా, గొటివాడ ఎంపీటీసీ సభ్యురాలు బొండా శేషుకుమారి బలపరిచారు. అనంతరం ఆమెకు మద్దతుగామిగతా పదిమంది ఎంపీటీసీలు చేతులు ఎత్తడంతో మామిడి లక్ష్మి గెలిచినట్టు రిటర్నింగ్ అధికారిణి ప్రకటించారు. అనంతరం ఆమెతో ప్రమాణస్వీకారం చేయించారు.

కూటమి ఎంపీటీసీలతో జతకట్టిన నలుగురు వైసీపీ ఎంపీటీసీ

వైస్ ఎంపీపీ ఎన్నికల్లో కూటమి పార్టీలైన టీడీపీకి చెందిన నలుగురు, జనసేనకు చెందిన ముగ్గురు ఎంపీటీసీ సభ్యులతో పాటు వైసీపీకి చెందిన అంతకాపల్లి ఎంపీటీసీ చొక్కాకుల గోవింద, సబ్బవరం-2 ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, సబ్బవరం-3 ఎంపీటీసీ సబ్బవరపు శ్రీనివాసరావు, నారపాడు ఎంపీటీసీ మామిడి లక్ష్మి హాజరయ్యారు. వైసీపీకి చెందిన మరో ఏడుగురు గైర్హాజరయ్యారు. ఇదిలావుండగా, గురువారం వైస్ ఎంపీపీ-2 ఎన్నికల్లో పాల్గొన్న నలుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు త్వరలోనే జనసేనలో చేరనున్నట్టు ప్రచారంలో ఉంది.

విజేత, ఎంపీటీసీ సభ్యులకు ఎమ్మెల్యే పంచకర్ల అభినందన

ఇదిలావుంటే, ఈ ఎన్నికల్లో సహకరించిన 11 మంది ఎంపీటీసీ సభ్యులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అభినందించారు. గురువారం ఇక్కడకు వచ్చిన ఆయన నూతనంగా ఎన్నికైన వైస్ ఎంపీపీ-2 మామిడి లక్ష్మితో పాటు మిగతా పది మంది ఎంపీటీసీ సభ్యులను శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ, తాను చర్చించుకున్న తరువాతే వైసీపీకి చెందిన నారపాడు ఎంపీటీసీ సభ్యురాలు మామిడి లక్ష్మని వైస్ ఎంపీపీ-2 గా నిలిపామని, దీంతో ఆమె విజయం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బొండా సత్యారావు, బలిరెడ్డి అప్పారావు, ఇందలి రమణ, రాపేటి రాము తదితరులు పాల్గొన్నారు

శాస్త్రీయ పద్ధతిలో లేగ దూడలను పెంచాలి



లేగ దూడల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సబ్బవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు శాస్త్రీయ పద్ధతిలో లేగ దూడలను పెంచడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ అధికారిణి డాక్టర్ ఎస్.సౌజన్య అన్నారు. మండలంలోని బోదివలసలో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుసంపద సంరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. పశువులకు, దూడలకు వ్యాక్సిన్‌లను సకాలంలో వేయాలన్నారు. దీని వలన పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. లేగ దూడల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న రైతులను ఆమె అభినందించారు. తొలుత సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన 42 మేలు జాతి లేగ దూడలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సంధ్య, డాక్టర్ జి.అరుణ, డాక్టర్ ఎస్.స్వర్ణలత, గ్రామ పెద్దలు గంతకోరు సూర్యనారాయణ, కోన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు
కుటుంబానికి ఆర్థిక సాయం



మృతురాలి భర్తకు నగదు అందిస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలోని కైలాసగిరిలో గల ఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పప్పుల లక్ష్మి కుటుంబానికి ఎస్పీ తుహిన్‌సిన్హా గురువారం ఆర్థికసాయం అందజేశారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా తమ ఒకరోజు వేతనాన్ని రూ.నాలుగు లక్షల 17 వేల 565లను సమకూర్చగా ఈ నగదును ఎస్పీ తుహిన్‌సిన్హా చేతుల మీదుగా లక్ష్మి భర్త శంకరరావుకు అందజేశారు.


సీలేరులో రేకుల షెడ్డులో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం


పగిలిపోయిన పైకప్పు రేకులు


నేలపైన చిన్నారులు

శిథిల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

- చిన్నారులకు రక్షణ కరువు
- పాడవుతున్న పౌష్టికాహార సరకులు
- సీలేరు పంచాయతీలో దుస్థితి

సీలేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు మేజర్‌పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం 30 ఏళ్ల క్రితం నిర్మించిన రేకుల షెడ్డులో ఈ కేంద్రాన్ని నెట్టుకువస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో 80 మంది వరకు గర్భిణులు, 45 మంది వరకు బాలింతలు, ప్రీ స్కూల్ చిన్నారులు 25 మంది వరకు ఉన్నారు. అయితే, వీరికి ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం శిథిల భవనంలో నిల్వ ఉంచుతున్నారు. భవనం పైకప్పు రేకులు బీటలు వారి చిన్నపాటి వర్షం కురిసినా నీరు లోనికి వచ్చి ఈ సరకులన్నీ తడిసి పాడైపోతున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు లోన కూర్చోడానికి వీలులేని పరిస్థితి నెలకొంటోంది. దీనికి పక్కా భవనం మంజూరు చేయాలని ఐసీడీఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు స్థానికులు వినతులు ఇచ్చినా ఫలితంలేకపోతోందని వారు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసినట్టు ప్రకటించినా నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. దీంతో రేకులషెడ్డులోనే నిర్వహించాల్సి వస్తోందని, దీని వల్ల ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తోందోనని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పక్కా భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జి.మాడుగుల ఎంపీపీగా అప్పలరాజు ఎన్నిక

- టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు


ఎంపీపీగా ఎన్నికైన అప్పలరాజు

జి.మాడుగుల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి గా టీడీపీకి చెందిన లొంబోరి అప్పలరాజు ఎన్నికయ్యారు. మండలంలోని 15 ఎంపీటీసీ సెగ్మెంట్లకు గాను గత స్థానిక ఎన్నికల్లో వైసీపీ 7, టీడీపీ 7 స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఒక స్వతంత్ర అభ్యర్థిని విజయం సాధించింది. దీంతో సదరు స్వతంత్ర్య అభ్యర్థి టీడీపీకి మద్దతు తెలుపడంతో ఎంపీపీ పీఠం టీడీపీ దక్కించుకుంది. అయితే, ఎంపీపీగా కొర్రా పద్మ రెండున్నరేళ్ల పదవి ముగియడంతో రాజీనామా చేశారు. దీంతో మండలంలో ఉన్న 15 ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు రాజీ నామా చేశారు. మిగిలిన 13 మంది సభ్యులతో గురువారం ఎన్నికల అధికారి విద్యాసాగర్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి చెందిన ఏడుగురు సభ్యులు హాజరై చేతులు ఎత్తి ఎంపీపీ అభ్యర్థి లొంబోరి అప్పలరాజుకు మద్దతు తెలిపారు.ఆయన బొయితిలి-కిల్లంకోట సెగ్మెంట్‌నుంచి ఎంపీటీసీ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే, వైసీపీ తరఫున పోటీలో ఉన్న కుడుముల సత్యనారాయణకు మద్దతుగా నలుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో పాడేరు మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి ఎం.మణికుమారి, ఏపీటీడీసీ డైరెక్టర్ కిల్లు రమేశ్‌నాయుడు, ట్రైకర్ డైరెక్టర్ కూడ కృష్ణారావు, టీడీపీ నాయకులు బొర్రా నాగరాజు, సోమెలి చిట్టిబాబు, వెంకటసురేశ్‌కుమార్, వెంకటరమణమూర్తి, కొండలరావు, మండల నాయకులు హాజరయ్యారు.

ప్రధానమంత్రి యోగా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి యోగా అవార్డు-2025కు కేంద్ర ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహనరావు తెలిపారు.ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దేశ, విదేశాల్లో యోగాకు ప్రోత్సాహం, అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు అందిస్తారని వివరించారు. ఆయా సంస్థలు, వ్యక్తులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని క్రీడా సంఘాలనుంచి ఆసక్తి కలిగిన యోగా విద్యార్థులు, నిపుణులు దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. పూర్తి వివరాలకు ఆయుష్ మంత్రిత్వ శాఖ లేదా సంబంధిత కార్యాలయంలో సంప్రదించాలన్నారు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది ఆందోళన



నిరసన తెలుపుతున్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది

పాడేరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 102 టెండర్‌ను పునరుద్ధరించి తమకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ, సంబంధిత ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా అధ్యక్షుడు వాసు మాట్లాడుతూతొమ్మిదేళ్లుగా రూ. 7,870 వేతనాలకు కెప్టెన్‌లుగా పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలన్నారు.ఈ నెల 31వ తేదీతో ముగియనున్న టెండర్ల తిరిగి ఆహ్వానించేప్పుడు ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీసవేతనం రూ. 18,600, అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వాలు కెప్టెన్‌లుగా గుర్తించి టెండర్ల వేయాలని కోరారు. ప్రతీ నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రతీ ఆరు నెలలకు కరువు భత్యం చెల్లించాలని, సిక్ లీవ్‌లు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, పదవీవిరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదరం, బాలచందర్, కొండబాబు, సింహాచలం, గణపతి, మహేశ్ పాల్గొన్నారు.

'కొయ్యూరు జడ్పీటీసీ నుంచి రక్షణ కల్పించాలి'


ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నేత రామారావు దొర

పాడేరురూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు నుంచి చటర్జీపురం పీవీటీజీ గిరిజనులకు ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఏపీ ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర ఐటీ డీఏ పీవో డాక్టర్ అభిషేక్ గౌడకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం చటర్జీపురం ఆవాస గ్రామంలో ఏళ్లతరబడి జీవిస్తున్న పీవీటీజీ ఆదివాసీలకు జడ్పీటీసీ నూకరాజు, అతని కుటుంబ సభ్యులు నుంచి రక్షణ కొరవడిందన్నారు. చటర్జీపురంలో సర్వే నంబరు 139లోని మెట్ట భూమిని సాగులోకి తీసుకువచ్చి పంటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారని, అక్కడే గిరిజనులు స్థిరనివాసం ఉంటున్నారన్నారు. ఆ భూముల నివేదికను జేఏసీ ఆధ్వర్యంలో అధికారులకు అందించామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన రామిరెడ్డి అనే గిరిజనేతరుడు నుంచి కొయ్యూరు మండల వైసీపీకి చెందిన జడ్పీటీసీ నూకరాజు కుమారుడు కన్నబాబు పదెకరాల భూమిని 2022లో కొనుగోలు చేశారు. ఆ భూమి ఆదివాసీల సాగులో ఉన్నందున గిరిజనేతరుడైన రామిరెడ్డి నూకరాజును రంగంలోకి దింపి ఆదివాసీలపై దాడులు చేస్తూ వారిని భయభ్రాంతులకు గురిస్తూ భూముల స్వాధీనానికి చూస్తున్నట్టు రామారావు దొర వివరించారు. అధికారులు స్పందించి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని కోరారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ భారతి


విద్యార్థినులతో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్న అధ్యాపకులు

చింతపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ మొబైల్‌లో శక్తి యాప్ ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో పోలీసు అధికారులు దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినుల మొబైల్‌లో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేయించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే పోలీసు పర్యవేక్షణ ఉంటుందన్నారు. మహిళలకు ఆపద సమయంలో సమాచారం పోలీసులు శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యలు అందిస్తారన్నారు. శక్తి యాప్ కలిగిన మహిళ ఆపద సమయంలో సింగిల్ టచ్ ద్వారా శక్తి బృందానికి సమాచారం పంపవచ్చునన్నారు. మహిళ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణమైనప్పుడు ఆమె గమ్యస్థానానికి చేరుకునే వరకు లైవ్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. ఆపద సంభవిస్తే ఆడియో, వీడియో కంట్రోల్ రూమ్‌కి చేరుతుందని, వెను వెంటనే శక్తి బృందం స్పందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు పాల్గొన్నారు.

గంజాయికి ప్రత్యామ్నాయంగా పంటల సాగు మేలు: ఏవో


అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య

చింతపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు గంజాయి సాగును విడిచిపెట్టి వ్యవసాయ పంటలపై దృష్టి సారించాలని స్థానిక మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కొత్తపూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయితో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ సాగు చట్టవ్యతిరేకమైందన్నారు. గిరిజనులు గంజాయి సాగు చేస్తే పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తారన్నారు. గిరిజన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా అవకాడో, సపోట, కాఫీ, నిమ్మ, జామ మొక్కలను ఉచితంగా అందజేస్తోందన్నారు. రైతులు ఈ పంటల సాగు ద్వారా ఆర్థిక ప్రగతి పొందాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు పొందేందుకు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండలంలో ఉన్న 6 వేల మంది జిరాయతీ భూముల పట్టా దారుల్లో 3,400 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికే రైతు భరోసా, విత్తనాలు, ఎరువులు అందుతాయన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ భూములు కలిగిన వచ్చే నెలలో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. రైతులు వారసత్వ భూములను మ్యూటేషన్ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.

నాన్ షెడ్యూల్డ్ గ్రామాల్లో సబ్ కలెక్టర్ పర్యటన


ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

అనంతగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నాన్ షెడ్యూల్డ్ పంచాయతీల్లో సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ గురువారం పర్యటించారు. ముందుగా భీంపోల్ పంచాయతీ సర్వే నంబరు 166లో 7.05 హెక్టార్లు, గుమ్మకోట పంచాయతీ భీమవరం 104 సర్వే నంబరులోని 5.06 హెక్టార్ల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు అప్పగించారు. గుమ్మకోట నుంచి గాలిపాడు, ఎన్ఆర్‌పురం నుంచి గాదిల్లోవ గ్రామాల రహదారుల్లో అటవీ శాఖ భూములుఉన్నాయి. ఈ రెండు సర్వే నంబర్లలోని ప్రభుత్వం భూమిని అటవీశాఖకు అప్పగించినట్టు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ఈ సందర్భంగా వివరించారు. ప్రభుత్వ భూములు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోని తహసీల్దార్ మాణిక్యం, ఆర్ఐ జగ్గయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు గరగల అలంకరణ


అమ్మవారి అలంకరణలో భక్తులు

సీలేరు, మార్చి 27, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో నూకాలమ్మ ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా గురువారం రాత్రి అమ్మవారి గరగల అలంకరణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం నుంచి భక్తులు ఊరేగింపుగా స్థానిక జలవిద్యుత్ కేంద్రం వెనుక గల కెనాల్ వద్దకు వెళ్లి అక్కడ అమ్మవారి గరగను తయారు చేసి పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉపాసకుడు గణేశ్ అమ్మవారు ఆవహించగా గరగను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారి సన్నిధిలో ప్రతిష్ఠించారు. శుక్రవారం అమ్మవారి గరగలను సీలేరు పురవీధుల్లో ఊరేగించి , శనివారం అమ్మవారి ప్రధాన పండుగను నిర్వహించనున్నట్టు ఉత్సవకమిటీ ప్రతినిధులు తెలిపారు.

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ


శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలతో సూపర్‌వైజర్లు

పెదబయలు, మార్చి27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 పంచాయతీలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సీతగుంట బాలుర పాఠశాల-1లో ఈ నెల 25 నుంచి నిర్వహించిన పోషణ్ బీ - పడాయి బీ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని అన్నారు. చిన్నారులు మూడేళ్ల వయసు వచ్చే వరకు నవ చేతన ద్వారా సంపూర్ణ పోషణ అందించాలన్నారు. బాలల ఎత్తు, బరువు పరిశీలించాలని కోరారు. చిన్నారులకు సమగ్ర అభివృద్ధి, శారీరక మేధోశక్తికి కృషి చేయాలని కకోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కేహెచ్‌వీ సత్యవాణి, ఎం. సింహాచలం, డి. సరస్వతి, సింహాచలం పాల్గొన్నారు.

'పట్టం గ్రామానికి బీటీ రోడ్డు వేయాలి'


జాతీయ రహదారుల అధికారికి వినతి పత్రం అందిస్తున్న జనసేన నాయకులు

డుంబ్రిగుడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అరకు-పాడేరు ప్రధాన రహదారికి ఆనుకుని ఒంటిపాక కూడలిలోని పట్టం గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని జాతీయ రహదారి అధికారులకు జనసేన నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కొర్రా పంచాయతీ ఉప సర్పంచ్ మల్లికార్జునరావు, జనసేన మండల అధ్యక్షుడు దనేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పట్టం రోడ్డు 50 మీటర్ల మేరకు తొలగించారన్నారు. దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మట్టితో రోడ్డు ఎత్తు చేయడంతో ప్రయాణికులు ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. 50 మీటర్ల మేర రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలు నివారించడానికి వీలవుతుందని విన్నవించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల నేత కోటేశ్వరరావు. లింగన్న తదితరులు పాల్గొన్నారు.

బంగారుమెట్ట- సంపంగిపుట్టు రహదారి మరమ్మతుకు వినతి


జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కు వినతి పత్రం ఇస్తున్న పెదబయలు టీడీపీ నేతలు

పెదబయలు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సమస్యలను పరిష్కారించాలని కోరుతూ రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌కు టీడీపీ మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారి, నేతలు వినతి పత్రాన్ని ఇచ్చారు. పాడేరులో కిడారి క్యాంప్ కా ర్యాలయంలో కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె తెలిపిన వివరాలి వి.. పాడేరు- జోలాపుట్టు ప్రధాన రహదారి సీకరి పంచాయతీకి చెందిన బంగారు మెట్ట నుంచి అడుగులపుట్టు పంచాయితీకి చెందిన సంపంగిపుట్టు వరకు రోడ్డు గోతులతో అధ్వానంగా మారిందని, తక్షణమే ఆ రోడ్డును వెడల్పు చేసి మరమ్మతులు చేయాలని కో రారు. పలు పంచాయతీలకు పక్క రహదారి సౌకర్యాలు కల్పించాలన్నారు. సీకరి పంచాయతీ పోతురాజు ఆలయం నుంచి శ్మశాన వాటిక వరకు, అలాగే సప్పన్నతోట బీటీ రో డ్డు నుంచి బుడియాసావడి వీధి వరకు సీసీ రోడ్లు నిర్మించాలన్నారు.పులుసుమామిడి జంక్షన్ నుంచి వెలపాలెం వరకు అర్థాంతరంగా నిలిచి పోయినా బీటీ రోడ్డు, కిముడుపల్లి పంచాయితీ కేంద్రం నుంచి లక్సర్‌పుట్ వరకు సుమారు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు, అరడగూడేం వరకు బీటీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. చైర్మన్ శ్రావణ్‌కుమార్ అధికారులతో మాట్లాడి ఈ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ వెంకటరమణరాజు, నాయకులు భూషణం, తిరుపతిరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జీకేవీధి వైసీపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్ తొలగింపు

- నూతన అధ్యక్షుడిగా కంకిపాటి గిరి ప్రసాద్


వైసీపీ నూతన మండలాధ్యక్షుడు గిరి ప్రసాద్

గూడెంకొత్తవీధి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇంతవరకు కొనసాగిన వైసీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్‌ని తొలగించినూతన అధ్యక్షుడిగా కంకిపాటి గిరిప్రసాద్‌ని నియమించారు.ఈమేరకు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వేశ్వరరాజు పాత అధ్యక్షులను తొలగించి కొత్తవారిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్టు కొంత కాలంగా ప్రచారం జరిగింది. అయితే, తాజాగా పూర్తి స్థాయి మండల కమిటీ నియమించకున్నా, అధ్యక్షుడిని జిల్లా అధిష్ఠానం ప్రకటించించడం గమనార్హం. ఈమేరకు గిరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ పురోగతికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఘాట్ రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం


కొండగుడ-ములియగుడ మధ్యలోని కూలిన రక్షణగోడ

అనంతగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగుడ-ములియగుడ గ్రామాలకు మధ్యన అరకు-విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని రక్షణగోడ కూలిపో యింది. సుమారు పది అడుగుల మేర శిథిలంకావడంతో ప్రయాణికులకు రక్షణలేకుండా ఉంది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే,రక్షణగోడ కూలి సుమారు రెండు నెలలవుతున్నా జాతీయ రహదారుల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదుపుతప్పిప్రమాదం జరిగితే తప్పా పట్టించుకోరా అని మండిపడుతున్నారు. రక్షణగోడ కూలిన ప్రదేశం భారీ లోయ కావడంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, ఘాట్‌రోడ్డు పాటుగా శిథిలావస్థకు చేరుకున్న రక్షణగోడలను మరమ్మతులు చేయించాలని వాహనదారులు, పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినికి వార్డెన్ పరామర్శ

అనంతగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగుడ గ్రామానికి చెందిన కిమిడి దివ్యను గురువారం వార్డెన్ రూపవతి పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిపై అడిగితెలుసుకున్నారు. స్థానిక బాలికల-1 పాఠశాలలోని ఏడో తరగతి చదువుతున్న దివ్య జ్వరంతో బాధపడుతూ.. తల్లిదండ్రులు సమక్షంలోని వైద్యసేవలను పొందుతోంది. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం విమలకుమారి ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థినికి సకాలంలో వైద్యసేవలను అందించామని, తల్లిదండ్రులు సమక్షంలో ఉండాలని పంపించినట్టు పేర్కొన్నారు. కొదంగుడ గ్రామంలో తల్లిదం డ్రుల వద్ద ఉంటున్న దివ్య ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని, తల్లిదండ్రులు, వార్డెన్ తెలిపారు.

రూ.29.7లక్షలతో జల్‌జీవన్ మిషన్ పథకం నిర్మాణం


దేవరాపల్లిలో భూమి పూజ చేస్తున్న సర్పంచ్ బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లి పంచాయతీ కేంద్రంలో త్వరలో తాగునీటి సమస్య పరిష్కారం కానుందని స్థానిక సర్పంచ్, టీడీపీ నేత సిరిబాల బుజ్జిబాబు అన్నారు. గురువారం పంచాయతీలో రూ.29.7లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న తాగునీటి పథకానికి సర్పంచ్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జల్ జీవన్ పథకం పూర్తయితే తమ పంచాయీలోని ప్రజలందరికి పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు లకే రామారావు, సాగిన చిరంజీవి, పాడి శ్రీనివాసు, పీసా ఉపాధ్యక్షుడు మొట్టడం రాంబాబు, కార్యదర్శి రామలింగం పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల చింతపల్లిలో ఏర్పాటు చేయాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

సీలేరు, మార్చి 27 , (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం సంతోషకరమని, అయితే, ఒకప్పుడు నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన చింతపల్లిలో కళాశాల ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్ కోరారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, చింతపల్లి నియోజక వర్గంనుంచి కొన్నేళ్ల కిందట పాడేరుకు మార్పు చేయడంతో ఈ ప్రాంతం అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. 2022లో విభజనలో పాడేరును అల్లూరు జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం, ఐటీడీఏ కార్యాలయం కూడా అక్కడే ఉండటంతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే, అరకును ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తుందన్నారు. మిగతా ప్రాంతాలను ప్రభుత్వం కానీ, అధికారులు కానీ పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. అభివృద్ధిని వికేంద్రీకరించడం ద్వారా జిల్లాలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

డుంబ్రిగుడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 29న టీడీపీ అవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్ట ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. యూనియన్ బ్యాంక్ సమీపంలో జెండాను అవిష్కరిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పార్టీ అనుబంధ సంఘాలు హాజరు కావాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డుంబ్రిగుడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేం ద్రాల్లో కేంద్రల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీడీపీవో నీలిమ తెలిపారు. మండలంలోని పోతంగి, కోర్రాయి, సాగర పంచాయతీల్లోని, డుంబ్రిగుడ, జాకరవలస, సాగర అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పీఎం జన్‌మన్ పథకం ద్వారా బుడింగులో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

మలేషియాలో చిక్కుకుపోయిన జి.కోడూరు వాసిని రప్పించాలని స్పీకర్‌కు వినతి


స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలిసిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

నర్సీపట్నం/మాకవరపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మలేషియాలో చిక్కుకు పోయిన మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామానికి చెందిన ఒమ్మి భూషణంను వెనక్కి రప్పించాలని కుటుంబ సభ్యులు స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కోరారు. ఈ మేరకు గురువారం బాధిత కుటుంబ సభ్యులు ఇక్కడి క్యాంప్ ఆఫీసు వద్ద స్పీకర్‌ను కలిశారు. మలేషియాలో చిక్కుకున్న భూషణంను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీంతో స్పీకర్ వెంటనే స్పందించి బాధితుడి వివరాలను మంత్రి నారా లోకేశ్‌కు తెలియజేశారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి విజయ్ కూడా అధికారులతో మాట్లాడారు. అధికారులు స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్వై పాత్రుడు, చిరంజీవిరాజు, నీటి సంఘం అధ్యక్షుడు కళ్యాణ్‌రాజు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త అమావాస్య పెద్ద జాగారం

- నేల డ్యాన్సులు, శక్తి వేషాలతో గరగలు ఊరేగింపు
- నేడు నర్సీపట్నంలో నూకాలమ్మ పండగ


అఘోరా వేషధారుడి ప్రదర్శనను తిలకిస్తున్న అయ్యన్న కుటుంబ సభ్యులు

నర్సీపట్నం, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : కొత్త అమావాస్య సందర్భంగా పెద్ద జాగారాన్ని ఇక్కడ ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి నూకాలమ్మ అమ్మవారి గరగలు ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. డప్పులు, నేల డ్యాన్సులు, అఘోరా, కాంగో, తప్పెటగుళ్ల నృత్యాలు, బాణా సంచా తదితరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ యువతను ఉర్రూతలూగించింది. భక్తులు నూకాలమ్మ తల్లిని దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, విజయ్, రాజేశ్ కుటుంబ సభ్యులు పెద్ద జాగారానికి హాజరయ్యారు. శుక్రవారం నూకాలమ్మ పండుగ సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. కమిటీ ఛైర్మన్ కొరుప్రోలు శ్రీను, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గొలుగొండలో..

గొలుగొండ : మండల కేంద్రం గొలుగొండలోని రెల్లి కాలనీలో నూకాలమ్మ వేడుక గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం రాత్రికి జాగారాలు జరిపారు. శుక్రవారం పండుగ నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేపట్టారు.

అనతి కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు

- కూటమి అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే రూ.15 కోట్లతో అభివృద్ధి
- కౌన్సిల్ సమావేశంలో 26వ వార్డు కౌన్సిలర్ పద్మావతి వెల్లడి
- ఇందిరా మార్కెట్ కూరగాయల వ్యాపారులను డిగ్రీ కళాశాల వద్ద నుంచి ఎప్పుడు తిరిగి పంపిస్తారని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ సౌజన్య ప్రశ్న
- మూడు అద్దె ట్రాక్టర్ల బిల్లుల చెల్లించని అంశంపై మాజీ చైర్ పర్సన్, అధికారుల మధ్య వాగ్వాదం

నర్సీపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే మునిసిపాలిటీలో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు జరగడం గొప్ప విషయమని టీడీపీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం ఇక్కడ ఏర్పాటైంది. తొలుత సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి సాధారణ సమావేశం అజెండాలలోని 34 అంశాలు, అత్యవసర అజెండాలోని ఐదు అంశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ వేసవిలో మునిసిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా కమిషనర్ ముందస్తు ప్రణాళికలు రూపొందించడం అభినందనీయమన్నారు. ఆస్తి పన్ను బకాయిలు ఒకేసారి చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీలో 50 శాతం రాయితీ కల్పించిందని వివరించారు.


కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

తొమ్మిదో వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ కొవిడ్ సమయంలో ఇందిరా మార్కెట్ కూరగాయల వ్యాపారులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు తరలించారని, అక్కడి నుంచి ఇందిరా మార్కెట్‌కు ఎప్పుడు తీసుకు వస్తారని ప్రశ్నించారు. పెదబొడ్డేపల్లి కూరగాయల మార్కెట్ వద్ద ఆదివారం, మంగళవారం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని తెలిపారు. కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ ఇందిరా మార్కెట్ మండల పరిషత్ ఆధీనంలో ఉందన్నారు. ఈ విషయాన్ని స్పీకర్ దృష్టిలో పెట్టామని వివరించారు. మునిసిపాలిటీకి అప్పగిస్తే అభివృద్ధి చేయడానికి వీలుపడుతుందన్నారు.

అంతకుముందు మునిసిపాలిటీ పారిశుధ్య విభాగంలో మూడు అద్దెట్రాక్టర్లు వాడుకొని బిల్లు మంజూరు చేయకపోవం ఏమిటని మాజీ ఛైర్‌పర్సన్, 17వ వార్డు కౌన్సిలర్ గుడబండి ఆది లక్ష్మి అధికారులను నిలదీశారు. అద్దె ట్రాక్టర్ల బిల్లు బకాయిలపై గంటపాటు సమావేశం నడిచింది. దీనిపై మాజీ ఛైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, అధికారుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మాజీ ఛైర్‌పర్సన్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ 2022 జూలై నుంచి 2023 సెప్టెంబరు వరకు మూడు అద్దె ట్రాక్టర్లను పారిశుధ్య విభాగంలో ఉపయోగించుకొని రూ.33 లక్షలు బిల్లులు బకాయిలు ఎందుకు చెల్లించ లేదని ఏఈ రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును నిలదీశారు. ఏఈ రవి సమాధానం ఇస్తూ ట్రాక్టర్లు అద్దెకు తీసుకోవడానికి పరిపాలనా అనుమతులు, వర్క్ ఆర్డర్ లేనిదే బిల్లులు చెల్లింపులు చేయడం జరగదని స్పష్టం చేశారు. టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా చేయడం వల్ల ఇటువంటి సమస్యలు ఉత్పన్నవుతున్నాయన్నారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ బిల్లులు ఎంబుక్ చేసి కౌన్సిల్ సమావేశంలో తీర్మానం తీసుకోవల్సి ఉందన్నారు. వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ రూ.1.99 కోట్లు పనులు నలుగురే కాంట్రాక్టర్ల కట్టబెట్టారని విమర్శించారు. దీనికి టీడీపీ కౌన్సిలర్లు డబ్బీరు శ్రీకాంత్, ధనిమిరెడ్డి మధు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

ఒప్పందం ప్రకారం ఎంపీపీగా సర్వేశ్వరరావు

- మాకవరపాలెంలో ప్రశాంతంగా ఎన్నిక
- టీడీపీ ఎంపీటీసీలు దూరం

మాకవరపాలెం, మార్చి27 (ఆంధ్రజ్యోతి) : మాకవరపాలెం మండలాధ్యక్షుడిగా రుత్తల సర్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈ ఎన్నిక నిర్వహించారు. మండలంలో వైసీపీకి పది మంది ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండగా, టీడీపీకి చెందిన ఎంపీటీసీ ఒకరు మృతి చెందారు. మరొక టీడీపీకి చెందిన ఎంపీటీసీ వైసీపీలోకి వెళ్లిపోయారు. అయితే వైసీపీ నుంచి రెండున్నరేళ్ల ఒకరికి, మరో రెండున్నరేళ్ల మరొకరికి ఎంపీపీ పదవులు ఇచ్చేందుకు అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో గురువారం నిర్వహించిన ఎంపీపీ ఎన్నికకు వైసీపీ నుంచి తొమ్మిది మంది ఎంపీటీసీలు ఎంపీపీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే వైసీపీకి చెందిన వజ్రగడ ఎంపీటీసీ ఎన్నికకు దూరంగా ఉన్నారు. టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఎన్నికకు హాజరు కాలేదు. దీంతో వైసీపీ నుంచి మాకవరపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల సర్వేశ్వరరావు ఎంపీపీగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి రామ్మోహనరావు ప్రకటించారు. ఎన్నిక నిర్వహణలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎంపికైన ఎంపీపీ సర్వేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ అభినందించారు.


సర్వేశ్వరరావు

పాకలపాడు ఉప సర్పంచ్‌గా ఈశ్వరమ్మ

గొలుగొండ : పాకలపాడు ఉపసర్పంచ్‌గా డి.ఈశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ సచివాలయంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఇక్కడ 12 మంది వార్డు సభ్యులకు గాను ఎనిమిది మంది సభ్యులు ఎన్నికకు హాజరయ్యారు. ఉప సర్పంచ్‌గా ఒకే నామినేషన్ పడడంతో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్టు ప్రకటించారు.



కార్పెంటర్ల సమస్యలు పరిష్కరించాలి

నర్సీపట్నం అర్బన్/కృష్ణాదేవిపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : కార్పెంటర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వారంతా కోరారు. కార్పెంటర్స్ డే సందర్భంగా గురువారం నర్సీపట్నం, గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలలో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పెంటర్ వృత్తిని నమ్ముకుని పెద్ద సంఖ్యలో జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులు దృష్ట్యా కుటుంబాల పోషణ కష్టంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నర్సీపట్నంలో యూనియన్ అధ్య క్షులు చంద్రశేఖర్, పొలుమూరి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు. కృష్ణాదేవిపేటలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.గాయత్రి, కామాక్షి వీరబ్రహేంద్రస్వామి వడ్రంగి పనివార్ల సంఘం ప్రతినిధులు తామరపల్లి శివ, వీరబాబు, శివప్రసాద్, బి. వరప్రసాద్, తాతాజీ, మణికంఠ, శ్రీనులతో పాటు పెద్ద సంఖ్యలో కార్పొంటర్లు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులకు గిన్నిస్ రికార్డు


మెప్మాకి వచ్చిన రికార్డులు, జ్ఞాపికలతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, తదితరులు

నర్సీపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు ఓఎన్‌డీసీ ఆన్‌లైన్‌లో లక్ష ఆర్డర్స్ సాధించినందుకు మునిసిపాలిటీకి చెందిన మెప్మా విభాగం గిన్నిస్ బుక్‌ఆఫ్ రికార్డు, యూనియన్ వరల్డ్ రికార్డు సాధించింది. వావ్ జీని యాప్‌లో ఒకేసారి పది వేల మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులు జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నందుకు యూనియన్ వరల్డ్ రికార్డు అందజేశారు. గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు, యూనియన్ వరల్డ్ రికార్డు జ్ఞాపికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా వ్యాపారవేత్తను తయారు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ జరిగి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా మెప్మా సిబ్బందిని, గ్రూప్ సభ్యులను ఆయన అభినందించారు.

ఒకటిన ఎడ్లబండ్ల పరుగు పోటీలు

కృష్ణాదేవిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం లింగంపేటలో నూకాలమ్మ పండుగను పురస్కరించుకుని ఏప్రిల్ ఒకటో తేదీ మంగళవారం జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి, నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

అభివృద్ధి పనులపై ఎంపీడీవో సమీక్ష

నాతవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎంబుక్ చేసి, త్వరగా బిల్లులు చెల్లించాలని ఎంపీడీవో ఉష్శశ్రీ సూచించారు. గురువారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పీఆర్‌జేఈ వెంకటేశ్వరమ్మతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చెల్లించాల్సిన బిల్లులు తదితరాలపై చర్చించారు. అలాగే సీసీ రోడ్లు ఇతర పనులు నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ తమపై పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుందన్నారు. అన్ని సర్వేలు తమకే అప్పగిస్తున్నారని ఎంపీడీవో ఉషశ్రీ వద్ద వాపోయారు. మండలంలో 17 గ్రామ సచివాలయాల్లో ఐదుగురు మాత్రమే ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఉన్నారని, మిగతా ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని వారు కోరారు.

పది గ్రామాలలో రీ సర్వే పూర్తి

- నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ


మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

రావికమతం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం డివిజన్ పరిధిలో 12 పైలెట్ గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించగా, ఇప్పటి వరకు పది గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తయిందని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లో పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసిన 12 గ్రామాలకు నర్సీపట్నం మండలంలో వేములపూడి, మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామాలు మినహా మిగిలిన పది గ్రామాలలో రీ సర్వే పూర్తయిందన్నారు. రీసర్వే, రెవెన్యూ సదస్సులో డివిజన్ పరిధిలో రైతుల నుంచి వచ్చిన 8,483 ఫిర్యాదులు, అలాగే రెవెన్యూ సదస్సుల్లో 3,932 దరఖాస్తులురాగా వాటిని కూడా పరిష్కరించామన్నారు. పోరంబోకు, గుట్టలు, గయ్యాలి తదితర భూముల్లో ఇంత వరకూ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు క్రమబద్ధీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహల్దార్ బీవీ రమణ పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

చోడవరం, మార్చి27(ఆంధ్రజ్యోతి): మాడుగుల నూకాలమ్మ తల్లి ఆలయ భూములకు ఈనెల 28 తేదీ శుక్రవారం ఆ గ్రామ సచివాలయంలో కౌలువేలం నిర్వహిస్తున్నట్టు స్థానిక దేవదాయ శాఖ ఈవో ఎస్.వీ.వీ. సత్యనారాయణ తెలిపారు. అలాగే, మండలంలోని అడ్డూరులోని రాజా చింతలపాటి సత్రం భూములకు కూడా శుక్రవారం అడ్డూరులో వేలం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఘనంగా నూకాలమ్మ జాతర

రోలుగుంట,మార్చి 27(ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కొవ్వూరు, బుచ్చెంపేట గ్రామాల్లో గురువారం ఘనంగా నూకాలమ్మ జాతర మహోత్సవా లను నిర్వహించారు. తహసీల్దార్ నాగమ్మ, డీటీ శంకర్‌రావు కొవ్వూరులో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ బంటు రాజు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు రాయితీ బస్సు పాస్‌లు

రావికమతం, మార్చి27 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పాఠశాలలో చదువుతున్న 14 మంది దివ్యాంగ విద్యార్థులకు గురువారం రాయితీ బస్సు పాసులను ఆర్టీసీ అధికారులు, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మీనాయుడు, జగన్నాధనాయుడు అందజేశారు.

శేమునాపల్లిలో బంగారం, వెండి వస్తువులు చోరీ

చోడవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేమునాపల్లిలో ఎల్లపు నూకరాజు నివాసంలో చోరీ జరిగింది. వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్న నూకరాజు బుధవారం ఉదయం దుకాణానికి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చారు. తలుపులు తీసి వుండడంతో ఆందోళన చెంది బీరువాలో పరిశీలించగా మూడు తులాల బంగారం, పది తులాల వెండి వస్తువులతోపాటు, రూ.20 వేల నగదు కనిపించలేదు. ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు, క్లూస్ టీమ్ శేమునాపల్లి వెళ్లి నూకరాజు నివాసంలో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాడుగుల ఉప సర్పంచ్‌గా వరహాలరావు ఏకగ్రీవం


ఉప సర్పంచ్ జవ్వాది వరహాలరావు

మాడుగుల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ మాడుగుల ఉప సర్పంచ్‌గా జవ్వాది వరహాలరావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత పంచాయతీ ఉప సర్పంచ్ 5 వార్డుకి చెందిన శ్రీనాధ శ్రీనివాసరావుని ఎన్నుకున్నారు. ఆయన కొన్ని అనివార్య కారణాలతో ఈ పదవికి రాజీనామా చేశారు. దీంతో గురువారం ఎన్నికల అధికారిణి జి రమణి పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది. 16మంది వైసీపీకిచెందిన వార్డు మెంబర్లకు గాను 15మంది పాల్గొని 16వ వార్డు మెంబర్ జవ్వాది వరహాలరావుకి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శి పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, సర్పంచ్ యడ్ల కళావతి పాల్గొన్నారు.

మాడుగుల మండల అధ్యక్షుడిగా రాజారామ్ ఏకగ్రీవంగా ఎన్నిక

మాడుగుల, మార్చి 27: స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడిగా తాళ్లపురెడ్డి రాజారామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఎన్నికల అధికారి వీరమ్మనాయుడు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులు, ఒక కో ఆప్షన్ మెంబర్ ఉన్నారు. వీరిలో 18 మంది వైసీపీ ఎంపీటీసీలు, ఇద్దరు టీడీపీ, ఒక ఇండిపెండిట్ ఎంపీటీసీ ఉన్నారు. అప్పట్లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీకి చెందిన ఎంపీటీసీలు ఎక్కువమంది ఉండటంతో ఎంపీపీగా వేమవరపు రామధర్మజని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో రెండున్నరేళ్ల కాలంపాటు ఆయన ఎంపీపీగా కొనసాగిన అనంతరం కొన్ని అనివార్య కారణాలతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. వైస్ ఎంపీపీగా ఉన్న తాళ్లపురెడ్డి రాజారామ్ ఇన్‌చార్జి ఎంపీపీగా ఇప్పటి వరకు కొనసాగారు. అయితే, ఇందులో కేజే పురం -1 (టీడీపీ) ఎంపీటీసీ కొంగలిపాక (ఇండిపెండింట్) ఎంపీటీసీ అభ్యర్థి ఘైచర్ల సన్యాసిరావులు మినహా మిగిలిన 19మంది ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబర్ పాల్గొన్నారు. దీంతో జమ్మాదేవిపేట ఎంపీటీసీ తాళ్లపురెడ్డి రాజారామ్‌ను మాడుగుల 2వ రెండవ సిగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడు వేమవరపు రాజారామ్ ప్రతిపాదించగా, మాడుగుల-1 ఎంపీటీసీ సభ్యురాలు పొలిమేర విజయలక్ష్మి బలపరిచారు. దీంతో ఎన్నికలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులంతా చేతులు పైకెత్తి రాజారామ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీపీ నియామక పత్రాన్ని ఆయనకు ఎన్నికల అధికారి అందించారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో ఎంపీపీకి సత్కరించారు.


మాడుగుల ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రాజారామ్

దేవరాపల్లి ఎంపీపీగా చింతల బుల్లి.లక్ష్మి

దేవరాపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీగా చింతల బుల్లిలక్ష్మి (వైసీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో 17 మంది ఎంపీటీసీ సభ్యులుండగా, వీరిలో టీడీపీకి చెందిన ఐదుగురు హాజరు కాలేదు. వైసీపీకి చెందిన 12 మంది ఎంపీటీసీ సభ్యులు లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మంజులావాణి ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. వైసీపీ ఎంపీపీగా ఉన్న కిలపర్తి రాజేశ్వరి టీడీపీలో చేరేందుకు వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. ఎ.కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యురాలిని వైస్ ఎంపీపీగా ఎన్నుకున్నారు. రాజేశ్వరీ పదవికి రాజీనామా చేయడంతో సీఈఓ ఆదేశాల మేరకు తాత్కాలిక ఎంపీపీగా చింతల బుల్లిలక్ష్మిని నియమించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఈ ఎన్నిక జరిగింది. సభ్యులు చింతల బుల్లి.లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎ. కొత్తపల్లి గ్రామ సర్పంచ్ చింతల. సత్యవెంకటరమణ అతని భార్య ఎంపీటీసీ సభ్యురాలిగా బుల్లిలక్ష్మి అప్పట్లో గెలిపొందడంతో. ఆమెకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారి మంజులవాణితో పాటు, ఎంపీడీఓ సువర్ణరాజు, ఏఓ లక్ష్మీనారాయణ ఈ ఎన్నిక నిర్వహించారు. ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ ఎన్నిక అనంతరం జడ్పీటీసీ కర్రిసత్యం,ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూరేబాబూరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అభినందించారు.


ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బుల్లిలక్ష్మి

చోడవరం వైస్ ఎంపీపీగా శరగడం లక్ష్మి

చోడవరం, మార్చి27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ వైస్ ఎంపీపీగా వైసీపీకి చెందిన అంభేరుపురం ఎంపీటీసీ సభ్యురాలు శరగడం లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీ పదవి కి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి బి. రాజేశ్వరి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మిని జన్నవరం ఎంపీటీసీ సభ్యుడు కంచిపాటి సన్యాసిదేవుడు ప్రతిపాదించగా, గోవాడ ఎంపీటీసీ ఆడారి కోటి భూలోకనాయుడు బలపరిచారు. లక్ష్మికి 17 మంది సభ్యులు మద్దతు పలకడంతో లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రత్యేక అధికారి ప్రకటించారు. మండల పరిషత్‌లో 25మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 20 మంది వైసీపీ ఐదుగురు టీడీపీ సభ్యులు ఉండేవారు. ఎన్నికల ముందు వైసీపీ ఎంపీటీసీ గట్రెట్టి రామలక్ష్మి ఆ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. తరువాత కాలంలో గౌరీపట్నం ఎంపీటీసీ వైసీపీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఇప్పటి ఎన్నికల్లో వైసీపీ చెందిన గూనూరు ధనలక్ష్మి, గౌరీపట్నం ఎంపీటీసీ సభ్యుడితో పాటు, టీడీపీ సభ్యులు ఎవరూ సమావేశానికి హాజరుకాలేదు. హాజరైన వారంతా లక్ష్మికి మద్దతు తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం వైస్ ఎంపీపీని ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన కుమారి, ఇతర ఎంపీటీసీ సభ్యులతో పాటు, వైసీపీ నేతలు ఏడువాక సత్యారావు, శరగడం సిమ్మునాయుడు, ఈశ్వరరావు,. డీవీ ఆర్, పల్లా నరసింగరావు, మొల్లి ప్రసాద్ తదితరులు అభినందించారు. ఈ ఎన్నిక కార్యక్రమాన్ని ఎండీవో పీవీ ఎస్‌జే ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు.


వైస్ ఎంపీపీని అభినందిస్తున్న ఎంపీపీ గాడి కాసు, ఎంపీటీసీ సభ్యులు

రాయపురాజుపేట ఉప సర్పంచ్‌గా రామ్మూర్తి ఎన్నిక

చోడవరం: మండలంలోని రాయపురాజుపేట పంచాయతీ ఉప సర్పంచ్‌గా పసుపులేటి రామ్మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో ముందుగా కుదిరిన ఒప్పందం మేరకు రామ్మూర్తినాయుడుకు వార్డు సభ్యులు మద్దతు తెలపడంతో ఆయన ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్టు ఈవో పీ ఆర్‌డీ మహేశ్ ప్రకటించారు. ఉపసర్పంచ్ దాడి భూలోకనాయుడు రెండున్నరేళ్ల పదవీకాలం ముగియడంతో పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానం లో ఒప్పందం ప్రకారంరామ్మూర్తి ఎన్నిక ఏకగ్రీవ మైంది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. నారాయణరావుతో పాటు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, బొడ్డేడ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ని కలిసిన టీడీపీ నాయకులు

చీడికాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నూతన తహసీల్దార్‌గా మూడు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన కిశోర్‌లింకన్‌ను తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు గురు వారం కలిసి ఘనంగా సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, నాయకులు గవిరెడ్డి జగన్నాధం, శరగడం శివ, బండారు దయాకర్, ఎస్‌విఎస్.నాయుడు, చలుగు అప్పలనాయుడు తదితర నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తొమ్మిది బోర్లు మంజూరు

బుచ్చెయ్యపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదికి నాలుగు, పి. భీమవరం పరిధిలో ఐదు తాగునీటి బోర్లు ఎంపీపీదారవరపు నాగేశ్వరరావుదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ మంజూరుచేశారు. వీటి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, దొండా నరేష్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, దొండా సన్యాసిరావు, సయ్యపురెడ్డి శ్రీనివాస్, మాదవరావు, తలారీ శంకర్, దొండా నానాజీ, సురేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ

బుచ్చెయ్యపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది, ఎల్‌బి. పురం, బంగారుమెట్ట గ్రామాల్లో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ సభ్యత్వ కార్డులను గ్రామ నాయకులకు అందజే శారు. ఆయా గ్రామాల్లో నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండానరేశ్, సన్యాసిరావు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, తమరాన దాసు, దొండా శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తలకు కార్డులు అందజేస్తున్న నాయకులు

దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

చీడికాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలపై టీడీపీ, వైసీపీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మతల అప్పలనాయుడు కోరారు. స్థానిక శివాలయం ఆవరణలో మండలంలోని దివ్యాంగులతో గురువారం సమావేశం జరిగింది. మంచాల గదబూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు కుమ్మరి లోవరాజు మాట్లాడుతూ, దివ్యాంగులకు గతంలా గ్రామీణ ఉపాధి పథకంలో ప్రత్యేక పనులు కల్పించాలని, ప్రతి దివ్యాంగుని కుటుంబానికి 200 యూనిట్లు వరకు కరెంటు ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కురచా జయమ్మ, టీడీపీమండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, సంఘం ఉపాధ్యక్షుడు వేచలపు శ్రీను, ప్రధాన కార్యదర్శి లెక్కల గోవింద, పరవాడ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు వివరిస్తున్న లోవరాజు

నూకాంబికా నమోనమః

అనకాపల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ జాతరను కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

నేటి నుంచి నెల రోజుల పాటు కొత్త అమావాస్య జాతర

- కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు
- 600 ఏళ్ల ఘన చరిత్ర గల ఆలయానికి విద్యుద్దీప కాంతులు



ఆలయం ప్రారంభంలో విద్యుత్ సెట్టింగ్



అమ్మవారి చరిత్ర

సుమారు 600 ఏళ్ల క్రిందట 1450 సంవత్సరంలో నూకాంబిక అమ్మవారు తొలుత కాకతాంబగా ఇక్కడ కొలువైంది. ఆర్కాట్ నవాబు దగ్గర సైన్యాధిపతిగా పనిచేసిన కాకర్లపూడి అప్పలరాజు కళింగ ఆంధ్ర ప్రభువైన బహుబలేంద్రుని ఓడించి అనకాపల్లి ఇలవేల్పు కాకతాంబ గుడిని కోటకు దక్షిణంగా నిర్మించారు. విజయనగరం రాజులు కాకతాంబ పేరును నూకాంబికా అమ్మవారుగా మార్పు చేసి కొలిచేవారు. తరువాత కాలంలో గోడి జగన్నాథరాజును అనకాపల్లి కోటకు సామంతరాజుగా విజయనగరం రాజు నియమించారు. ఆయన అనేక సంవత్సరాలు బ్రిటిష్ వారికి పన్నులు చెల్లించకపోవడంతో కోటను వేలం వేశారు. వైరిచర్ల ఆనందగజపతిరాజు వేలం పాటలో కోటను సొంతం చేసుకున్నారు. అప్పటి నుంచి వైరిచర్ల వంశీయులే దేవస్థాన శాశ్వత ధర్మకర్తలుగా వ్యవహరించే వారు.

1935లో దేవదాయశాఖ ఆధీనంలోకి ఆలయం

నూకాంబిక అమ్మవారి దేవాలయం 1935 సంవత్సరంలో దేవదాయశాఖ ఆధీనంలోకి కి వచ్చింది. నాటి నుంచి దేవాలయం దినదినాభివృద్ధి చెందింది. 40 వసతి గదులు, క్యాంప్లెక్స్, కల్యాణ మండపం వంటి నిర్మాణాల వలన భక్తులు, యాత్రికులకు అన్ని విధాలా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి ఏటా ఫాల్గుణ బహుళ అమావాస్య (అంటే ఉగాది ముందు రోజు) నుంచి చైత్ర బహుళ అమావాస్య వరకు నెల రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతూ వస్తున్నాయి. ఈ ఏడాది నుంచి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కృషితో రాష్ట్ర పండుగగా రూపాంతరం చెందడంతో అందుకు తగ్గట్టుగా సౌకర్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఇ-శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదుకు 31 వరకు గడువు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ మరణించిన, పాక్షిక/ శాశ్వత అంగవైకల్యం పొందిన వారు కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం ఇ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జి కమిషనర్ కె.వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసంఘటితరంగ కార్మికులు 2022 సంవత్సరం మార్చి 31వ తేదీకి ముందు మరణించినా లేదా గాయపడిన వారి వివరాలు కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వం ఇ-శ్రమ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, సదరు పోర్టల్‌లో కార్మికులు స్వయంగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అందుకు కార్మికుని ఆధార్‌కార్డు, దానికి అనుసంధానమైన మొబైల్ నంబరు, కార్మికుని సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ నంబరు, ఐఎఫ్ఎస్సీ కోడ్, బ్రాంచ్ వివరాలు అవసరమన్నారు. కార్మికులు స్వయంగా రిజిస్టర్.ఇ-శ్రమ్.జీవో.ఐఎన్/యుఎస్ఈఆర్/సెల్ఫ్ లింక్‌ను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణ

- విచారణాధికారిగా తుమ్మపాల షుగర్స్ ఎండీ

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)లో అనేక అవకతవకలు బయటపడిన నేపథ్యంలో సహకార శాఖ 51 విచారణకు ఆదేశించింది. ఈపీడీసీఎల్ నుంచి తక్కువ రేటుకు విద్యుత్ కొని దానిని మూడు రెట్లు ఎక్కువకు విక్రయించి లాభాలు పొందుతున్న ఆర్ఈసీఎస్ ఆ నిధులను పక్కదారి పట్టించింది. ఉద్యోగులు, ఉన్నతాధికారులు అంతా కలిసి కోట్లాది రూపాయలు స్వాహా చేశారని ఫిర్యాదులు అందడంతో సొసైటీని స్థానిక డిస్కమ్‌కు అప్పగించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశించింది. దాంతో ఆర్ఈసీఎస్‌ను గత రెండేళ్లుగా ఈపీడీసీఎల్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తప్పులు బయటపడడంతో ఎండీని తప్పించారు. అయితే పూర్తిస్థాయి విచారణ ఇప్పటికీ నిర్వహించలేదు. బాధ్యులను గుర్తించలేదు. దీనిపై స్థానిక నాయకులు ఫిర్యాదు చేయడంతో సహకార శాఖ కమిషనర్ 51 విచారణకు ఆదేశించారు. ఇలాంటి సమయాల్లో విచారణ అధికారిని వారే నిర్ణయిస్తారు. కానీ ఈ కేసులో ఎందుకో ఆ బాధ్యత జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)కే అప్పగించారు. దాంతో ఇక్కడి డీసీఓ ప్రేమస్వరూప విచారణాధికారిగా తుమ్మపాల షుగర్స్ ఎండీ ఎంవీఎస్ శాస్త్రిని నియమించారు. నిధులు దుర్వినియోగంపై లోతైన విచారణ చేస్తే తప్ప వాస్తవాలు బయటకు రావనే వాదన వినిపిస్తోంది.

కోలుకోని కోడి

- బర్డ్ ఫ్లూ ప్రభావంతో భారీగా పడిపోయిన చికెన్ అమ్మకాలు
- ధరలు సైతం నేల చూపులు
- జిల్లాలో వైరస్ ప్రభావం లేనప్పటికీ పెరగని చికెన్ విక్రయాలు
- కిలోకు రూ.20 మేర నష్టపోతున్న పౌల్ట్రీల నిర్వాహకులు



నర్సీపట్నంలో బ్రాయిలర్ కోళ్ల స్టాక్ పాయింట్



లాలం రాజు, బ్రాయిలర్ కోళ్ల వ్యాపారి

నర్సీపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ ప్రభావం తగ్గినప్పటికీ దాని నుంచి పౌల్ట్రీ పరిశ్రమ కోలుకోలేకపోతున్నది. చికెన్ వినియోగానికి ప్రజలు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. బర్డ్ ఫ్లూ వల్ల కలిగిన నష్టాల నుంచి బయటపడదా మనుకునే తరుణంలో వేసవి వచ్చేసింది. దీంతో కొత్తగా కోడి పిల్లలను పెంచడానికి ఫారాల నిర్వాహకులు ముందూ వెనుకా ఆలోచిస్తున్నారు. దీంతో వేసవిలో చికెన్‌కు డిమాండ్ బాగానే వున్నప్పటికీ అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో కోళ్ల మృత్యు వాతపడే ప్రమాదం వుంది. దీంతో జూన్ వరకు బ్రాయిలర్ కోళ్ల వ్యాపారం మందకొడిగానే వుంటుందని పౌల్ట్రీల నిర్వాహకులు చెబుతున్నారు.

రెండు నెలల క్రితం వరకు బ్రాయిలర్ కోడి (లైవ్) కిలో రూ.140 ఉండేది. బర్డ్ ఫ్లూ వైరస్ ప్రబలడంతో చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. దీంతో ఫిబ్రవరిలో రూ.90కి పడి పోయింది. నర్సీపట్నంలో ప్రస్తుతం బ్రాయిలర్ కోడి (లైవ్) కిలో రూ.110 ఉంది. ఈ రేటుకు కోళ్లను అమ్ముకుంటే కిలోకు రూ.20 వరకు నష్టపోతామని, అలాఅని ఫారంలో వుంచుకునే పరిస్థితి లేనదని అంటున్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావం దాదాపు తగ్గిపోయినప్పటికీ చికెన్ వినియోగానికి ప్రజలు ఆసక్తి చూపడంలేదు. అనకాపల్లి జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేనప్పటికీ వేరేచోట్ల వైరస్ ప్రబలడంతో ఆ ప్రభావం ఇక్కడ పడిందని పౌల్ట్రీ ఫారాల యాజమానులు చెబుతున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే ప్రస్తుతం 75 శాతం మేర చికెన్ అమ్మకాలు పడిపోయాయని పెదబొడ్డేపల్లికి చెందిన స్టాక్ పాయింట్ యజమాని ఒకరు తెలిపారు.

మునిసిపాలిటీ పరిధిలోని నర్సీపట్నం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లి ప్రాంతాల్లో ఎనిమిది చికెన్ స్టాక్ పాయింట్లు ఉన్నాయి. అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఉన్న స్టాక్ పాయింట్‌లో రోజూ మూడు వేల కోళ్లు విక్రయించే వారు. బర్డ్ ఫ్లూ వైరస్ తర్వాత రోజుకు 500 కోళ్లు కూడా అమ్ముడు పోవడం లేదని స్టాక్ పాయింట్ యజమాని లాలం రాజు అంటున్నారు. స్టాక్ పాయింట్‌లో 35 మంది సిబ్బంది పని చేస్తుంటారని, కోళ్ల రవాణాకు ఆరు వాహనాలు ఉపయోగిస్తున్నామని, బర్డ్ ఫ్లూ కారణంగా వ్యాపారం పడిపోయినప్పటికీ నిర్వహణ ఖర్చులు, సిబ్బందికి జీతాలు ఇవ్వక తప్పడం లేదని ఆయన వాపోతున్నారు.

కూరగాయల మార్కెట్‌లో సినిమా షూటింగ్ సందడి

అనకాపల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కూరగాయల మార్కెట్‌లో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 24 డేస్ అనే పేరుతో సిరి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎన్ని శ్రీనివాస్ నిర్మాణ సారథ్యంలో మార్కెట్‌లో హీరో, హీరోయిన్ల సీన్, ఫైట్స్ సన్నివేశాలను రచయిత, దర్శకులు కిరణ్ వారియార్ చిత్రీకరణ చేశారు. దర్శకుడు కిరణ్‌కు ఇది రెండో చిత్రం. గతేడాది మెగాస్టార్ ఫ్యాన్స్ అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రస్తుతం 24 డేస్ చిత్రం షూటింగ్ సన్నివేశాలను గాంధీమార్కెట్ (కూరగాయల మార్కెట్)లో చిత్రీకరించారు. హీరో, విలన్‌ల మధ్య ఫైట్ సన్నివేశాలను చిత్రీకరించారు. నూతన నటీ నటులతో నిర్మిస్తున్న సినిమాలో ఎన్ని రోహిత్, జీవన్, సందీప్, కాశీరామ్, లోవరాజు హీరోలుగా నటిస్తున్నారు. హీరోయిన్‌గా సోనమ్ నటిస్తున్నారు. ఈ చిత్రం అద్యంతం హర్రర్, కామెడీ నేపథ్యంలో సాగుతుందని దర్శకులు కిరణ్ వారియార్ తెలిపారు. ఈ చిత్రాన్ని మే 24వ తేదీన విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



ఫైటింగ్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ లాభదాయకం

- ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జగన్నాథరావు

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలు, బెల్లంతో తయారు చేసే వివిధ ఆహార ఉత్పత్తులకు అధిక డిమాండ్ ధర ఉందని, మహిళలు వీటి తయారీ ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చునని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. గురువారం ఆర్ఏఆర్ఎస్‌లో విలువ ఆధారిత తినుబండారాల తయారీపై జరిగిన మహిళల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో నిర్వహించే ఈ కార్యక్రమంలో సబ్బవరం, కె.కోటపాడు ప్రాంతాల్లో ఎంపిక చేసిన మహిళలు శిక్షణ పొందుతున్నారు. చిరుధాన్యాలు, బెల్లంతో తయారైన చాక్లెట్లు, కేకులు, బిస్కెట్లు, తదితర వస్తువులను తయారు చేయడంలో మెలకువలను వీరు నేర్చుకుంటున్నారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.శ్రీదేవి, శాస్త్రవేత్త కుసుమ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పీవీకే జగన్నాథరావు

‘స్థానిక’ ఖాళీలకు సజావుగా ఎన్నికలు

... మొదటి పేజీ తరువాయి

రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన ఎంపీపీ స్థానానికి ప్రస్తుతం నిర్వహించిన ఎన్నికలో రాజారాంను ఎన్నుకున్నారు.

ఎస్.రాయవరం ఎంపీపీగా వెంకటలక్ష్మి

ఎస్.రాయవరం ఎంపీపీగా కొరుప్రోలు ఎంపీటీసీ సభ్యురాలు కేసుబోయిన వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎంపీపీగా ఎన్నికైన చినగుమ్ములూరు సభ్యురాలు బొలిశెట్టి శారదా కుమారి రాజకీయ కారణాలతో కొంతకాలం తరువాత రాజీనామా చేశారు. దీంతో కోన లోవలక్ష్మి ఎంపీపీ అయ్యారు. ఇటీవల ఆమె రాజీనామా చేయడంతో గురువారం ఎన్నిక నిర్వహించారు.

వైసీపీ రెబెల్‌కు టీడీపీ, జనసేన మద్దతు

సబ్బవరం వైస్ ఎంపీపీ-2 నారపాడు ఎంపీటీసీ సభ్యురాలు మామిడి లక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో జరిగిన ఎన్నికల్లో మండలంలో 19 ఎంపీటీసీ స్థానాలకుగానూ 15 వైసీపీ, నాలుగు టీడీపీ గెలుకున్నాయి. ఒప్పందం మేరకు వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద గత ఏడాది ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. వైస్‌ఎంపీపీ-1 దాడి వెంకటసూర్య జాన్సీలక్ష్మీరాణి గత ఏడాది జనసేనలో చేరారు. దీంతో ఆమె వైస్‌ఎంపీపీ పదవికి రాజీనామా చేయలేదు. ఈమెతోపాటు మరో ఇద్దరు వైసీపీ సభ్యులు కూడా జనసేనలో చేరారు. దీంతో కూటమి బలం ఏడుకి పెరిగింది. వైసీపీకి చెందిన మరో నలుగురు సభ్యులు జనసేన పార్టీ నేతలతో టచ్‌లో వున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన వైస్ ఎంపీపీ-2 ఎన్నికకు కూటమి సభ్యులతోపాటు వైసీపీకి చెందిన నలుగురు హాజరయ్యారు. వీరిలో నారపాడు సభ్యురాలు మామిడి లక్ష్మిని ఎన్నుకున్నారు. ఈమెతోపాటు మిగిలిన ముగ్గురు వైసీపీ సభ్యులు త్వరలో జనసేనలో చేరనున్నట్టు తెలిసింది. కాగా చోడవరం వైస్ ఎంపీపీగా వైసీపీకి చెందిన అంభేరుపురం ఎంపీటీసీ సభ్యురాలు శరగడం లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉపసర్పంచులు...

చోడవరం మండలం రాయపురాజుపేట ఉపసర్పంచ్‌గా పసుపులేటి రామ్మూర్తి, గొలుగొండ మండలం పాకలపాడు ఉపసర్పంచ్‌గా దుంపబోయిన ఈశ్వరమ్మ, మాడుగుల ఉపసర్పంచ్‌గా జవ్వాది వరహాలరావు, మునగపాక మండలం నాగులాపల్లి ఉపసర్పంచ్‌గా గోసాల గోవిందరాజులు, తోటాడ ఉపసర్పంచ్‌గా కోట్ల హేమ, నారాయుడుపాలెం ఉపసర్పంచ్‌గా కొయ్య నల్లయ్య, రాజుపేట ఉపసర్పంచ్‌గా జెర్రిపోతుల కనకమహలక్ష్మి, రాంబిల్లి మండలం కొత్తపేట ఉపసర్పంగా బొడ్డు ప్రసాద్, కోటవురట్ల మండలం బాపిరాజుకొత్తపల్లి ఉపసర్పంచ్ పెదపూడి రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోరం లేకపోవడంతో మునగపాక పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక జరగలేదు. అచ్యుతాపురం మండలం వెదురువాడ పంచాయతీ ఉపసర్పంచ్ పదవికి గురువారం ఎన్నిక నిర్వహించాల్సి వుండగా ఏఈపీఆర్డీ శ్రీరామనాయుడు అస్వస్థతకు గురికావడంతో శుక్రవారానికి వాయిదా పడింది.

క్రైం... crime news

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

చోడవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంభేరుపురం, వెంకన్నపాలెం జంక్షన్ మధ్య గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అంభేరుపురం గ్రామానికి చెందిన గోవాడ షుగర్స్ కార్మికుడు దొడ్డి పైడిరాజు తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపక్కన పడి ఉన్న ఇతనిని గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపటి తరువాత అంబులెన్స్‌లో అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొత్తూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరు కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కొండుపాలెం గ్రామానికి చెందిన పిల్లల సంతోశ్ రేబాకలో ఒక వాటర్ ప్లాంటులో పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా కోడూరు కూడలి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో సంతోశ్ తీవ్రంగా గాయపడ్డాడు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

కశింకోట సాయినగర్‌లో చోరీ

కశింకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లోని ఓ ఇంట్లో 2.5 తులాల బంగారం, 40 తులాల వెండి సామగ్రి, రూ.40 వేలు నగదు చోరీకి గురయ్యాయి. ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌కు చెందిన బండారి మహేశ్వరరావు, జయలక్ష్మి దంపతులు ఈ నెల 16న గాజువాకలో ఉంటున్న కుమారుడి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి బుధవారం తిరిగిఇ వచ్చారు. ఇంటి ప్రధాన గేటు తాళం పగులగొట్టి వుంది. ఇంట్లోకి వెళ్లి చూడగా గదుల్లో ఉన్న నాలుగు బీరువాల్లోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2.5 తులాల బంగారం, 40 తులాల వెండి సామగ్రి, రూ.40 వేల నగదు అపహరణకు గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గర్భిణి మృతిపై బంధువుల ఆందోళన

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లుగా పిల్లలు లేని దంపతులు ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రతించారు. మందులు వాడడంతో ఆమె గర్భవతి అయింది. కవలపిల్లలు పుడతారనే ఆనందంలో ఉండగా తీవ్ర అనారోగ్యానికి గురైంది. కడుపులోనే పసికందులు మృతిచెందగా, కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆమె కూడా మృతిచెందింది. దీంతో బంధువులు ఫెర్టిలిటీ వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. మాకవరపాలేనికి చెందిన గెంజి లక్ష్మికి ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. పిల్లలు లేకపోవడంతో విశాఖలోని రామ్‌నగర్ వద్ద గల ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రతించారు. చికిత్స కోసం సుమారు రూ.10 లక్షలకు అంగీకరించి, కొంత మొత్తం చెల్లించారు. ఈ క్రమంలో లక్ష్మి గర్భం దాల్చింది. ఆమె కడుపులో కవల పిల్లలున్నారని వైద్యులు తెలిపారు. కాగా ఈ నెల 24న ఆమె తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ఫెర్టిలిటీ సెంటర్‌కు తీసుకు వచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు ఆమె గర్భంలో కవలలు మృతిచెందినట్టు గుర్తించారు. లక్ష్మి ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని, కేజీహెచ్‌కు తీసుకు వెళ్లాలని సూచించారు. కేజీహెచ్ వైద్యులు ఆమెకు శస్త్రచికిత్స చేసి, గర్భంలో మృతిచెందిన కవలలను బయటకు తీశారు. అనంతరం చికిత్స అందిస్తుండగా లక్ష్మి మృతిచెందింది. దీంతో ఫెర్టిలిటీ సెంటర్ వైద్యుల నిర్లక్ష్యంతోనే లక్ష్మి మృతిచెందిందని ఆమె బంధువులు కేంద్రం ఎదుట ఆందోళన చేశారు.

ఏటీఎం కార్డుల దొంగ అరెస్టు

... మొదటి పేజీ తరువాయి

ఏటీఎం కార్డుతో నగదు డ్రా చేయడానికి వెళ్లింది. ఆమె నగదు తీసుకున్న తర్వాత అక్కడే వున్న వెంకటసాయి కిరణ్, ఆమెకు చెందిన ఏటీఎం కార్డుని దొంగలించాడు. అనంతరం రూ.30 వేలు డ్రా చేశాడు. మరుసటి రోజు ఈ విషయాన్ని గమనించిన రుక్సానా.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పట్టణ పోలీసులు, అనకాపల్లి క్రైమ్ సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఏటీఎం కార్డు చోరీకి పాల్పడింది పాత నేరస్థుడు వెంకటసాయి కిరణ్‌గా గుర్తించారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. గురువారం నర్సీపట్నం ఎల్ఐసీ బిల్డింగ్ ఏటీఎం సెంటర్ వద్ద పట్టణ ఎస్ఐ రమేశ్‌కు పట్టుబడ్డాడు. కిరణ్‌కు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పలు ఏటీఎం కార్డులు, సెల్ ఫోను, రూ.28 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో ఇతనిపై 13 కేసులు వున్నాయి. రెండేళ్లు జైలు శిక్ష అనుభవించాడు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎలమంచిలి, అచ్యుతాపురం, తగరపువలస, అరకులోయ, సబ్బవరం, పాడేరుల్లో ఏటీఎం కేంద్రాల్లో ప్రజలను మోసం చేసి ఏటీఎం కార్డులను చోరీ చేసి నగదు డ్రా చేశాడు.

ఈసారీ అరకొర సరకులే!

... మొదటి పేజీ తరువాయి

సరఫరా చేశారు. కందిపప్పు, గోధుమ పిండిని అప్పుడప్పుడు అందించారు. అయితే వైసీపీ అధికారంలో వున్నప్పుడు కందిపప్పు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో ఆ ప్రభావం కూటమి ప్రభుత్వంపై పడింది. దీంతో గత తొమ్మిది నెలల్లో రెండు నెలలు మాత్రమే కందిపప్పు, గోధుమ పిండి రేషన్ కార్డుదారులకు పంపిణీ చేశారు. కాగా గోధుమ పిండి అవసరమా? లేదా? అని రెండు నెలల క్రితం సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే చేయిస్తే అత్యధిక శాతం మంది కావాలని కోరారు. రేషన్ డిపోల ద్వారా కందిపప్పు, గోధుమ పిండి సరఫరా చేయకపోవడంపై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జయంతిని ‘ఆంధ్రజ్యోతి’ వివరణ కోరగా.. మే నెల నుంచి కందిపప్పు సరఫరా చేస్తామని, గోధుమ పిండిని కార్డుదారులు తీసుకోవడంలేదని అన్నారు.

చింతపండుకు మరింత గిరాకీ

... మొదటి పేజీ తరువాయి

పాడేరు, అనంతగిరి, హుకుంపేట మండలాల్లో పలు గ్రామాల గిరిజనులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం చింతపండు సీజన్ కావడంతో ఎక్కువమంది కావిళ్లు, బుట్టలతో సంతకు తీసుకువస్తున్నారు. సుమారు 20 కిలోల బరువు గల కావిడి చింతపండు గత వారం రూ.1,500 నుంచి రూ.1,600లకు కొనుగోలు చేయగా, ఈ వారం రూ.1,600 నుంచి రూ.1,650 వరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది చింతచెట్లకు కాపు తక్కువ వచ్చిందని, దీంతో చింతపండుకు గిరాకీ ఏర్పడి తమకు గిట్టుబాటు లభిస్తున్నదని గిరిజనులు సంతోషంతో చెబుతున్నారు.

విద్యార్థులకు తగ్గనున్న మోతభారం

... మొదటి పేజీ తరువాయి

సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, హిందీ కలిపి ఒక పుస్తకం, పీఎస్, ఎన్ఎస్ కలిపి మరో పుస్తకం, హిస్టరీ, జియోగ్రఫీ, పాలిటిక్స్ కలిపి ఒక పుస్తకంగా, మూడు వర్క్ బుక్స్ అందజేస్తారు. గతంలో 15 పుస్తకాల వరకూ ఉండేవి. అటువంటిది ఆరు పుస్తకాలకు తగ్గించడంతో విద్యార్థులకు మోత భారం తగ్గనున్నది. సిలబస్ విషయంలో కూడా కొంత వెసులుబాటు కలగనున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏటా మే నెలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తుంటారు. అయితే కొత్త ప్రభుత్వం ఈ ప్రక్రియను మార్చి నుంచే ప్రారంభించింది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఉన్న 46 మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ఏడాది సుమారు 38 లక్షలకు పైబడి పుస్తకాలు అవసరమవుతాయని అధికారులు లెక్కించారు. ప్రస్తుతం వివిధ తరగతులకు సంబంధించి 3,99,153 పుస్తకాలు గాజువాకలోని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల విక్రయ కేంద్రానికి చేరుకున్నాయి. దఫదఫాలుగా ఏప్రిల్ నెలాఖరులోగా మొత్తం పుస్తకాలు డిపోకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424